


కర్నూలు బస్సు ప్రమాదం రాష్ట్రాన్ని కలిచివేసింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. మంత్రులు ఘటన స్థలానికి చేరుకుని బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వ సహాయం కొనసాగుతుండగా, వైసీపీ మాత్రం నీచ రాజకీయాలు చేస్తూ శవ రాజకీయాలకు దిగింది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



బుధవారం 29.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 192 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## ప్రజల ఆకాంక్షల మేరకే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ



**● మంత్రివర్గ ఉపసంఘంతో సీఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):**రాష్ట్రంలో చేపట్టిన జిల్లాల పునర్ వ్యవస్థీకరణతో ప్రజల ఆకాంక్షలు నెరవేరి, పరిపాలనా సౌలభ్యం కలగాలని మంత్రులు, అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సమస్యలు పరిష్కారం కావాలని, అదే సమయంలో కొత్త ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై ఈ ఏడాది జూలై 22న ఏడుగురు సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిపై సచివాలంయలో నిర్వహించిన సమీక్షకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పాటు... ఉప సంఘంలోని మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డి హాజరయ్యారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమిక నివేదిక సిద్ధం చేశామని మంత్రులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. గత ప్రభుత్వంలో అశాస్త్రీయంగా జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటును సరిదిద్దేలా జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైనా, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపైనా సీఎం చర్చించారు. 2లో...



## లోటుపాట్లు ఉండొద్దు...

# క్షేత్రస్థాయిలో ఉండి భరోసా ఇవ్వాలి

**తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ**

**వాగులు పొంగే అవకాశం ఉన్న చోట్ల మరింత అప్రమత్తం**

**డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని, గాలుల విధ్వంసాన్ని గుర్తించి పునరుద్ధణ పనులు**

**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొంథా తుఫాను ప్రభావంపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్ష ప్రభావంతో ఆకస్మికంగా వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంగళవారం ఆర్టీజీఎస్ నుంచి మొంథా తుఫాను ప్రభావంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తో కలిసి సమీక్షించారు. గతంలో వచ్చిన తుఫాన్ల కారణంగా జరిగిన నష్టాన్ని బేరీజు వేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం మొంథా తుఫాను కోస్తాంధ్ర తీరానికి అత్యంత సమీపంగా వస్తోందని.. ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా చేరుకుని తీరాన్ని దాటే అవకాశముందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం కాకినాడ, మచిలీపట్నం, విశాఖ తదితర తీరప్రాంతాల్లో వర్షాలు, గాలుల తీవ్రత ఎక్కువగా ఉందని సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం తుఫాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు మరిన్ని రెస్క్యూ బృందాలను, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను పంపాలని ఆదేశించారు. గాలులు, వర్ష తీవ్రతను అంచనా వేస్తూ అందుకు తగినట్టుగా యంత్రసామాగ్రిని, సమాచార పరికరాలను అత్యవసర యంత్రాలను, బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెండు రోజుల నుంచి రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షానికి ఎంత ప్రాంతం నీట మునిగింది...? ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో అంచనా వేసి లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గ్రామ వార్డు సచివాలయాల నుంచి క్షేత్రస్థాయి సమాచారం తెప్పించుకుని విశ్లేషించుకోవాలన్నారు. గతంలో హుద్ హుద్ తుఫాను సృష్టించిన విధ్వంసం నుంచి ప్రజలను నాలుగు రోజుల్లో తిరిగి బయటకు తెచ్చామని సీఎం గుర్తు చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదైనందున ఆ ప్రాంతంలోని ఎర్రకాలువకు ఎగువ నుంచి ఆకస్మాత్తుగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేయటంతో పాటు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని సీఎం ఆదేశించారు. మిగతా 2లో...

## 1,238 గ్రామాల ప్రజలు తరలింపు

**● ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం**

**● ప్రజలంతా చైతన్యవంతులై అప్రమత్తంగా వ్యవహరించాలి**

**● మంత్రులు, ఎమ్మెల్యేలంతా క్షేత్రస్థాయిలోనే ఉండి పర్యవేక్షిస్తున్నారు**

**● ప్రతి 2 గంటలకోసారి ముఖ్యమంత్రి పరిస్థితిని సమీక్షిస్తున్నారు**

**● ప్రధానమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నాం**

**● మొంథా తుపాను ముందస్తు చర్యలపై మంత్రి నారా లోకేష్**




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో సుమారు 40లక్షల మంది ప్రజలు ప్రభావితమవుతున్నారు. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు అత్యధిక తీవ్రత కలిగిన ప్రాంతాలుగా గుర్తించాం. ఆ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఆ జిల్లాలు రెడ్ అలర్ట్‌లో ఉన్నాయి. ప్రజాప్రభుత్వం లక్ష్యం ఒక్కటే, ఎటువంటి ప్రాణ నష్టం ఉండకూడదు, ముఖ్యమంత్రి ఆదేశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చెప్పారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హోంమంత్రి అనితతో కలిసి మంగళవారం సాయంత్రం మంత్రి లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ.... తుపాను సహాయ చర్యల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. ఒకపక్క డిజాస్టర్ మేనేజర్‌మెంట్ మంత్రి అనిత గారు, మరోవైపు ఆర్టీజీఎస్ మంత్రిగా నేను సమన్వయంతో గత 24గంటలుగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. గత ఐదు రోజులుగా మొంథా తుపాను గమనాన్ని పరిశీలిస్తూ తుపాను ప్రభావిత ప్రాంతాలపై దృష్టిసారిస్తున్నాం. ఈ రోజు రాత్రి 11.30 గం.లకు అమలాపురం సమీపంలో తుపాను తీరం దాటబోతోంది. ఈ సందర్భంగా 90 నుంచి 100 కి.మీల వేగంతో అక్కడ ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది.

**1906 తాత్కాలిక షెల్టర్ల ఏర్పాటు :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు ఈ నెల 23వ తేదీ నుంచి నేరుగా పర్యవేక్షిస్తున్నారు. మిగతా 2లో...

## రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనపై కసరత్తు పూర్తి..!

**● మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులపై సీఎం, డిప్యూటీ సీఎం సమీక్ష**

**● కొత్త జిల్లాలు,10 కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటుకు అవకాశం**

**● నవంబర్ 7న క్యాబినెట్ సమావేశంలో ఆమోదం**

**● అమరావతి, మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఏర్పాటు చేసే అవకాశం**

**● డిసెంబర్ 31 లోగా ప్రక్రియ పూర్తి**

**● కొత్త జిల్లాల ఏర్పాటు, సరిహద్దుల మార్పుపై 200 అర్జీలు**




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):**రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన ఒక కొలిక్కి వచ్చిందని అధికారులు చెబుతున్నారు కొత్త జిల్లాల ప్రతిపాదనలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమీక్షించారు. నవంబర్ 7న జరిగే. క్యాబినెట్ సమావేశంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. అయితే మదనపల్లె జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వం సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు.

గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాల్లో ఉన్న 25 పార్లమెంటు నియోజకవర్గాలను ఒక్కొక్క జిల్లాగా ఏర్పాటు చేసింది. అప్పట్లో దీనిపై వ్యతిరేకత వచ్చింది. అయితే ఈ విభజన అశాస్త్రీయంగా ఉందని ఫిర్యాదులు రావడంతో ప్రజల అవసరాలు, పాలనా సౌలభ్యమే ప్రధాన అజెండాగా జిల్లాల పునర్ వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఏడుగురు మంత్రులతో ఉప సంఘం వేసింది. ఈ మంత్రుల బృందం ప్రజల నుంచి సేకరించిన సమాచారం, ఫిర్యాదులు, అభ్యంతరాలపై మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షించారు.

కేబినెట్ సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు అనగాని, నారాయణ, నాదెండ్ల, సత్యకుమార్, అనిత, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్ధన్ రెడ్డితోపాటు సీఎస్ విజయానంద్ తో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన జరిగిందని, ఇది సరిదిద్దాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు, మిగతా 2లో...

## పత్తి కనీస మద్దతు ధర రూ.8,110



**● నేటి నుంచే పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

**● వెల్లడించిన వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర రైతాంగానికి ఉపశమనం కల్పించేలా, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను నేటి నుంచే ప్రారంభించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం మెంథా తుఫాను తీవ్రత నేపథ్యంలో, రైతులు నష్టపోకుండా ఉండేందుకు గాను, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 30 కొనుగోలు కేంద్రాలలో తక్షణమే ప్రత్తి సేకరణ చేపట్టాలని సీసీఐ, సంబంధిత అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా, 2025-26 సంవత్సరానికి 4.56 లక్షల హెక్టార్లలో పత్తి సాగైనట్లు, సుమారు 8 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాలుకు రూ. 8,110/-కనీస మద్దతు ధరను రైతులకు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పత్తి అమ్ముకోవాలనుకునే రైతులు కొనుగోలు ప్రక్రియను సక్రమంగా పాటించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా తమ వివరాలను సీఎం యాప్ లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత "కపాస్ కిసాన్" యాప్‌లో అదే వీఏఏ సహాయంతో స్లాట్ బుక్ చేసుకొని, మిగతా 2లో...

## అంతర్గత జలమార్గాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఎంవోయూ




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** ముంబైలోని నేస్కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇండియా మారిటైమ్ వీక్ -2025 కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో మైలురాయి ఏర్పడింది. రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ మరియు ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా మధ్య కీలకమైన ఎంవోయూ కుదిరింది.

ఈ ఒప్పందం రాష్ట్రంలో అంతర్గత జలమార్గాల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని మంత్రి తెలిపారు. జలమార్గాల ద్వారా సరుకు రవాణా వ్యయం భారీగా తగ్గనుందని, పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభించనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మిగతా 2లో...

## మొంథా ఎఫెక్ట్ - 107 రైళ్లు రద్దు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** మొంథా తుపాను దృష్ట్యా ప్రయాణికుల భద్రత కోసం రైల్వే శాఖ చర్యలు చేపట్టింది. కోస్తా ప్రాంత జిల్లాలకు వెళ్లే పలు రైళ్లను రద్దు చేసింది. నేడు, రేపు నడిచే 107 రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇవాళ 70 రైళ్లు, రేపు 36 రైళ్లు, ఎల్లుండి ఒక రైలు రద్దు చేసినట్లు పేర్కొంది. విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖ, గుంటూరు మీదుగా నడిచే పలు రైళ్లు ఇందులో ఉన్నాయి.

## 124 బస్సులు సీజ్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** బస్సుల్లో సీట్లకు అనుమతి తీసుకున్న అనేక ట్రావెల్స్ సంస్థలు వాటి స్థానంలో బెర్తులు అమర్చి, భారీగా ఛార్జీలు వసూలు చేస్తూ ఏళ్లుగా దందా సాగిస్తున్నట్లు బట్టబయలైంది. కర్నూలు శివారులో కాలిపోయిన వీకావేరి బస్సుకు ఒడిశా రవాణా శాఖ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉంది. అందులో 43 సీట్ల బస్సు అని మాత్రమే అధికారులు పేర్కొన్నారు. మిగతా 2లో...

## విద్యుత్ శాఖ చర్యలు - 1,000 బృందాలు, 12 వేల మంది సిబ్బంది




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** 'మొంథా' తుపాను కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తితే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించేందుకు విద్యుత్ శాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. తుపాను ప్రభావిత ప్రాంతాలకు అవసరమైన మెటీరియల్, సిబ్బందిని ముందస్తుగా తరలించింది. ఈ మేరకే ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా జెనరేటర్లు, సమాచారం అందించేందుకు వాకీటాకీలను అందుబాటులో ఉంచింది. డిస్కంల పరిధిలో 24 గంటలు పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. 3లో

## ఏపీలో రూ.765 కోట్లతో ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమ




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):**ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కాంపోనెంట్ స్కీం కింద దేశంలోని మూడు రాష్ట్రాల్లో రూ. 5,500 కోట్ల పెట్టుబడితో ఏడు ప్రాజెక్టుల ఏర్పాటుకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ ఆమోద ముద్ర వేసింది. ఆ శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ సోమవారం ఢిల్లీలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఏడు ప్రాజెక్టుల్లో మొత్తం రూ. 36,559 కోట్ల విలువైన ఉత్పత్తులు తయారవుతాయని, 5,100 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఇందులో సైర్మా స్ట్రాటెజిక్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో రూ. 765 కోట్ల పెట్టుబడితో మల్టీ లేయర్ ప్రింటెండ్ సర్క్యూట్ బోర్డు తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఇందులో మొత్తం రూ. 6,933 కోట్ల విలువైన ఉత్పత్తులు తయారవుతాయి. 955 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. మిగతా 3లో...

## పత్తి కనీస మద్దతు ధర రూ.8,110



(మొదటి పేజీ తరువాయి)

స్లాట్ ప్రకారం సిసిఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు కేంద్రాల ద్వారా (జిన్నింగ్ మిల్లుల ద్వారా) మాత్రమే పత్తిని అమ్ముకోవాలని కోరారు. ఇందుకోసం జిల్లా వ్యవసాయ అధికారులు, మార్కెటింగ్ అధికారులు దిగువ స్థాయి సిబ్బందికి తగు సూచనలు ఇస్తూ, ఏఏఏ లు రైతులకు పూర్తి సహకారం అందించేలా పర్యవేక్షించి, కొనుగోలును విజయవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**మోంథా తుఫాన్ తీవ్రత అధికంగా ఉన్నా రైతులు ఆందోళన చెందవద్దు :** మోంథా తుఫాన్ తీవ్రత అధికంగా ఉండబోతున్నా, రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో కూడా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఎన్నో తీవ్ర ప్రకృతి విపత్తులను విజయవంతంగా ఎదుర్కొన్నదని, ఈసారి కూడా అదే పద్ధతిలో ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, అధికారులు, సిబ్బంది అందరినీ అప్రమత్తం చేసినట్లు చెప్పారు. వ్యవసాయ మరియు ఉద్యాన పంటల ప్రాథమిక నష్ట అంచనా నివేదికలు ఇప్పటికే సేకరించామని, ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు నష్ట నివారణ చర్యలు చేపట్టామని వివరించారు. రైతుల కోసం ప్రత్యేకంగా సోషల్ మీడియా ద్వారా 24 గంటల సలహా, సూచనలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటల నష్టం తగ్గించే చర్యలపై రైతులకు మార్గదర్శకత్వం వహిస్తున్నారని చెప్పారు. తుఫాన్ అనంతరం నష్టం వాటిల్లిన ప్రతి రైతును ప్రభుత్వం పూర్తిగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఈ క్లిష్ట సమయంలో రైతులు ధైర్యంగా ఉండాలి. ప్రభుత్వం మీతో ఉంది, అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మత్స్యకారులను ముందుగా అప్రమత్తం చేసి వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, వారి వలలు, బోట్లు రక్షించుకునే ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మూగజీవుల ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

పాడి రైతులు బలహీన పశువులను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సూచనలు ఇచ్చామని, అధికారులు, సిబ్బంది ఎటువంటి సెలవులు తీసుకోకుండా హెడ్‌క్వార్టర్స్‌లో సిద్ధంగా ఉండాలని ఆదేశించామని మంత్రి అచ్చెన్న తెలిపారు.

## అంతర్గత జలమార్గాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఎంవోయూ



(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎంవోయూ ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అంతర్గత జలమార్గాలను బలోపేతం చేయడంలో భాగంగా దాదాపు రూ. 150 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. వెస్సెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ మరియు నావిగేషనల్ ఎయిడ్స్‌ను కేంద్రం అందించనుండగా, రివర్ క్రూయిజ్ టూరిజం మరియు వెస్సెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఆన్‌షోర్ సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని కేటాయించనుంది.

జాతీయ జలమార్గాల్లో డ్రెడ్జింగ్ కోసం కేంద్రం స్వంత నిధులతో లేదా పీపీపీ మోడల్‌లో ఆపరేటర్లను నియమించి ఫెయిర్‌వే సదుపాయాలు కల్పించనుంది. డ్రెడ్జింగ్ మెటీరియల్ డంపింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన భూమిని కేటాయించాల్సి ఉంటుంది.

రాష్ట్రంలోని జాతీయ జలమార్గాల్లో రివర్ క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి కేంద్రం సహకారం అందించనుంది. ప్రతిపాదిత క్రూయిజ్ టెర్మినల్స్ మరియు వెస్సెల్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌స్టేషన్లకు చివరి మైలు కనెక్టివిటీని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది. నిబంధనల మేరకు అంతర్గత జలమార్గాల్లో ఓడల ట్రాఫిక్ నియంత్రణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే.

ఈ కార్యక్రమంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, విశాఖ పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబే, ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రవీణాదిత్య, మారిటైమ్ బోర్డు సీఈఓ అభిషేక్ కుమార్, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ జడ్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 124 బస్సులు సీజ్

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్యం ఆ తర్వాత బెర్తులు అమర్చింది. ఈ మార్పును గురించి తెలుసుకున్న ఏపీ రవాణా శాఖ అధికారులు ఎట్టకేలకు కళ్లు తెరిచారు. ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఆలిండియా పర్మిట్‌తో తిరుగుతున్న బస్సులను తనిఖీ చేస్తున్నారు. ఇప్పటికే 3 రోజుల తనిఖీల్లో భాగంగా 124 బస్సులను సీజ్ చేశారు. వీటిలో 100కుపైగా బస్సులను సీజ్ చేయడానికి కారణం మార్పులే(ఆల్ట్రేషన్).

ఏపీ, తెలంగాణ పరిధిలో తిరిగే ట్రావెల్స్ బస్సుల సంఖ్య 2 వేలకుపైనే. గతంలో బస్సులకు ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయించేవారు. కొన్నేళ్లుగా ఇతర రాష్ట్రాల్లో రీ-రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ట్రావెల్స్ వారు నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కేంద్రపాలిత ప్రాంతాలైన దమణ్-దీవ్, పుదుచ్చేరిలకు వెళ్లి బస్సులకు రీ-రిజిస్ట్రేషన్ చేయించుకుని, అక్కడి సిరీస్ నంబర్లు పొందారు. ఆ రాష్ట్రాల(హోంస్టేట్)కు ట్యాక్స్‌తోపాటు, ఆలిండియా పర్మిట్ ఫీజు చెల్లించి బస్సులను తెలుగు రాష్ట్రాల్లో తిప్పుతున్నారు. సీట్లతో నడుపుతామంటూ రీ-రిజిస్ట్రేషన్ సమయంలో పేర్కొని తర్వాత వాటిల్లో బెర్తులు అమర్చినట్లు వెలుగులోకి వచ్చింది.

రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఆలిండియా పర్మిట్, బీమా ప్రీమియం కాపీ, తదితరాలన్నింటిలోనూ సీట్ల బస్సులని స్పష్టంగా ఉంది. ఆ తర్వాత వాటిని స్లీపర్లుగా మార్చేశారు. ఇలా ఆల్ట్రేషన్ చేసిన బస్సుల సంఖ్య వందల్లోనే ఉంటుందని అధికారుల అంచనా. ఈశాన్య రాష్ట్రాలతోపాటు, ఇతర రాష్ట్రాల అధికారులతో మన రవాణాశాఖ అధికారులు సంప్రదింపులు జరిపారు. స్లీపర్ బస్సులుగా మార్చుకునేందుకు అనుమతినిచ్చారా? అని ఆరా తీశారు. అలాంటి అనుమతులేమీ ఇవ్వలేదని వారు స్పష్టం చేశారు.

3 రోజుల నుంచీ పార్కింగ్ ప్రాంతాలకే పరిమితం : రాష్ట్ర రవాణాశాఖ అధికారులు మూడు రోజులుగా ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేస్తున్నారు. ఆలిండియా పర్మిట్‌తో నడిచే బస్సులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో అనేక ట్రావెల్స్ యాజమాన్యాలు జాగ్రత్త పడ్డాయి. ఆల్ట్రేషన్ చేసిన, అత్యవసర ద్వారం వద్దా సీట్లు, బెర్తులు అమర్చిన బస్సులను మూడు రోజుల నుంచీ పార్కింగ్ ప్రాంతాలకే పరిమితం చేశాయి. కొద్దిరోజులయ్యాక వాటిని మళ్లీ రోడ్లెక్కించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

45 రోజుల్లో ఓసారి సొంత రాష్ట్రానికి వెళ్లాలి : కేంద్ర రవాణాశాఖ 2021, 2023లో తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం ట్రావెల్స్ సంస్థలు బస్సులకు ఆలిండియా టూరిస్ట్ పర్మిట్(ఏఐటీపీ) తీసుకొని ప్రయాణికులను ఎక్కించుకొని నడుపుతున్నాయి.

# 1,238 గ్రామాల ప్రజలు తరలింపు

(మొదటి పేజీ తరువాయి)

యుఏఈకి వెళ్లే ముందు, అక్కడ నుంచి వచ్చిన తర్వాత 12 రివ్యూ మీటింగ్ లు, టెలీ కాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ ల ద్వారా తుపాను పరిస్థితులపై సమీక్ష చేశారు. ప్రధాని నరేంద్రమోడీ గారు సీఎంతో మాట్లాడి ముందస్తు ఏర్పాట్లపై వాకబు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రియల్ టైమ్ రిపోర్టులు పంపించింది. రాష్ట్రానికి ఏం కావాలన్నాసాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రధానమంత్రి చెప్పారు. తుపాను ప్రభావం, ముంపు తీవ్రత అధికంగా ఉండే 1,328 గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 3,465 గర్భిణీలను తరలించి, వారికి కావాల్సిన పౌష్టికాహారం, నిత్యావసరాలను అందజేస్తున్నాం. 1,906 తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటుచేసి పునరావాసానికి అవసరమైన సామగ్రి అంతా పంపించాం. శానిటేషన్ కు అవసరమైన బ్లీచింగ్ పౌడర్, లైమ్, ఇతర సామగ్రిని ఆయా గ్రామాలకు చేరవేశాం.



**ఎన్ డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం :** 14,798 పాఠశాలలకు సెలవులు ప్రకటించాం, 364 స్కూళ్లను పునరావాస కేంద్రాలుగా మార్చాం. ఈ నెల 29వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేసి, నిషేదాజ్ఞలు విధించాం. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం 11 ఎన్ డీఆర్ఎఫ్, 12 ఎస్ డీఆర్ ఎఫ్ టీమ్ లు, రిజర్వ్ టీమ్ లు కూడా సిద్ధంగా ఉన్నాయి. అవసరమైతే రావడానికి ఆర్మీ కూడా హైదరాబాద్ లో సిద్ధంగా ఉన్నారు. 145 ఉడ్ కటింగ్ టీమ్స్ సిద్ధంగా ఉన్నారు, ఇప్పటికే విశాఖపట్నం, తదితర ప్రాంతాల్లో చెట్లు పడిపోయిన చోట వారు సేవలందిస్తున్నారు. మెడికల్ అండ్ హెల్త్ కు సంబంధించి 325 శిబిరాలు సిద్ధం చేశాం, 876 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ కూడా రెడీగా ఉన్నాయి.

**సహాయ చర్యలపై ముందస్తు ఏర్పాట్లు :** తుపాను తీరం దాటిన తర్వాత పునరుద్ధరణ కార్యక్రమాలు చాలా కీలకం. ముఖ్యంగా విద్యుత్ శాఖకు సంబంధించి 11,347 స్తంభాలు, 1210 ట్రాన్స్ ఫార్మర్లు రెడీ చేశాం. సైక్లోన్ డైరెక్షన్‌ను బట్టి సేవలందించేందుకు 772 రిస్టోరేషన్ టీమ్స్ ను కూడా సిద్ధంగా ఉంచాం. హాస్పటల్స్ కు కూడా ఎటువంటి అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎక్కడైన రోడ్లు కోతకు గురైతే వెంటనే పునరుద్ధరించి, ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 7,289 జేసీబీ, క్రేన్స్, వాహనాలు సిద్ధంగా ఉంచాం. తాగునీటికి సంబంధించి వాటర్ ట్యాంకర్లను రెడీ చేశాం. తుపాను సమయంలో ప్రధానంగా ప్రభావితమయ్యేది సీపీ డబ్ల్యూ స్కీమ్స్. తిత్లీ అనుభవాలతో ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో పక్కాగా చర్యలు చేపట్టి 1,037 డీజిల్ జనరేటర్లను ఆయా ప్రాంతాలకు పంపించాం. ఎయిర్ టెల్, జియో, ఇతర సర్వీసు ప్రొవైడర్లు సెల్ ఫోన్ టవర్లకు అవసరమైన డీజి సెట్లు సిద్ధం చేశారు, డీజిల్ కూడా అందుబాటులో ఉంచాం.

**రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం :** తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యల కోసం కలెక్టర్లందరికీ నిధులు విడుదల చేశాం. ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ప్రధాన లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఆర్టీజీఎస్ లో రాత్రంతా బసచేసి రియల్‌టైమ్ మానిటరింగ్ చేస్తాం. ముఖ్యమంత్రిగారు ప్రతి 2గంటలకు ఒకసారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మొంథా తుపాను తీరందాటాక వెనువెంటనే డ్రోన్స్, లోలెవల్ ఫ్లయింగ్ వెహికల్స్ తో పంట నష్టం, ఇళ్లు, ఆస్తి నష్టంపై రియల్ టైమ్ ట్రాకింగ్ పెట్టి యుద్ధప్రాతిపదికన సహాయ, పునరావాస చర్యలు ప్రారంభిస్తాం. ప్రభుత్వం ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. దయచేసి ప్రజలంతా ఇళ్లలోనే ఉండండి. బీచ్ లు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దు. అధికారులు చెప్పిన జాగ్రత్తలు పాటించండి. 100 కి.మీ.ల వేగంతో తుపాను వస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బంది పడతాం. ఈ సమయంలో బీచ్ ల దగ్గరకు వెళ్లడం మంచిది కాదు. ఈ రాత్రి 11.30 గంటల నుంచి పరిస్థితి చాలా క్రిటికల్ గా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్నిచోట్ల భారీవర్షాలు పడుతున్నాయి. తీరం దాటాక కూడా భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

**ప్రజాప్రతినిధులంతా క్షేత్రస్థాయిలోనే :** ఈ రోజు ఉదయం హోంమంత్రి, నేను ఎమ్మెల్యేలు, ఎంపీలతో మాట్లాడాం, వారివద్ద నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. గోపాలపురం ఎమ్మెల్యే ఎర్రకాలువ సమస్య ఉందన్నారు. వెంటనే తగు చర్యలు చేపట్టాం. తుపాను తీరం దాటాక క్షేత్రస్థాయిలో గ్రామాలు, పంటపొలాలకు వెళ్లి సహాయ, పునరావాస చర్యల్లో పాల్గొనాల్సిందిగా ప్రజాప్రతినిధులకు సూచించాం. ఇప్పుడు మా దృష్టి అంతా ప్రజలను చైతన్యవంతం చేసి, అప్రమత్తం చేయడమే. ప్రభుత్వం ఈ నెల 23నుంచే అప్రమత్తంగా ఉంది. ముఖ్యమంత్రిగారు ఇప్పటికి 12సార్లు సమీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజాప్రతినిధులంతా ఫీల్డ్ లోనే ఉన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో సహా మంత్రులంతా తుపాను ప్రభావిత ప్రాంతాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మంత్రులతోపాటు అందరూ అప్రమత్తంగా ఉన్నారు. దీనిని తేలిగ్గా తీసుకోకుండా సీరియస్ గా పనిచేస్తున్నాం.

**ఆర్టీజీఎస్ లో అవేర్ ప్లాట్ ఫాం :** తుపాను తీరం దాటిన తర్వాత యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరిస్తాం. తుపాన్లను ఎదుర్కోవడంలో ముఖ్యమంత్రి గారికి ఎంతో అనుభవం ఉంది. ఆయన 1996 కోనసీమ తుపాను, హుద్ హుద్, తిత్లీ సమయంలో సమర్థవంతమైన సేవలు అందించారు. గత 5 రోజుల నుంచి మేమంతా ప్రిపరేషన్ లో ఉన్నాం. చెట్లు కూలిపోయినపుడు వాటిని తొలగించే వరకు ఫాలో అప్ మెకానిజం ఏర్పాటుచేశాం. హోం మంత్రి మానిటర్ చేస్తున్నారు. 10 నిమిషాల్లో క్లియర్ చేయాలని సీఎం గారు ఆదేశించారు. ప్రజాప్రతినిధులతో నేను మాట్లాడాను. అందరూ సిద్ధంగా, అప్రమత్తంగా ఉన్నారు. ప్రమాదం సంభవించకుండా చాలాప్రాంతాల్లో భారీ ఫ్లెక్సీలు తొలగించాం. తుపానుకు సంబంధించి పూర్తిస్థాయి డేటా మాకు ఎప్పటికపుడు వస్తోంది. ఆర్టీజీఎస్ లో అవేర్ ప్లాట్ ఫాం ఏర్పాటుచేశాం. రియల్ టైమ్ మానిటర్ చేస్తున్నాం. డిజాస్టర్ మేనేజ్ మెంట్, రిలీఫ్, రిహాబిలిటేషన్ ఇంటిగ్రేషన్ చేస్తున్నాం. వాట్సాప్, ఎస్ఎంఎస్, వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

**అన్నిశాఖలూ సర్వసన్నద్ధం :** సహాయ చర్యల్లో ఎక్కడా అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. 99 శాతం కచ్చితత్వంతో మాకు సమాచారం అందుతోంది. రియల్ టైం సమాచారాన్ని, ప్రభుత్వం తీసుకున్న చర్యలు ప్రధాని కార్యాలయానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. ప్రధానిమంత్రి స్వయంగా ఫోన్ చేసి మాట్లాడారు. పీఎంఓ వారు కూడా మానిటర్ చేస్తున్నారు. గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధులంతా తుపాను పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. వివిధ రకాల సోర్స్ ద్వారా డేటా సేకరిస్తున్నాం. శాటిలైట్ మ్యాప్స్ కూడా తీసుకుంటున్నాం. ప్రజలను అప్రమత్తం చేసి చైతన్యం తేవడమే మా లక్ష్యం. ఇది రాజకీయాలకు సమయం కాదు. ప్రజలకు సేవలందించేందుకు అన్నిశాఖలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని మంత్రి నారా లోకేష్ చెప్పారు. విలేకరుల సమావేశంలో హోం మంత్రి అనిత పాల్గొన్నారు.

## లోటుపాట్లు ఉండొద్దు - క్షేత్రస్థాయిలో ఉండి భరోసా ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

**ప్రభావిత ప్రాంతాల్లో తక్షణం పునరుద్ధణ చర్యలు :** గడచిన 24 గంటల్లో విశాఖ, కోనసీమ, శ్రీకాకుళం, అనకాపల్లి, పశ్చిమగోదావరి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. మొంథా తుపాను ప్రభావం కారణంగా వర్ష ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి భారీ వర్ష సూచనలకు సంబంధించిన సమాచారాన్ని మొబైల్ ఫోన్లకు పంపామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా 2,703 జనరేటర్లను కూడా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని సీఎంకు తెలిపారు. సచివాలయాల వారీగా నిత్యావసర వస్తువులను కూడా సిద్ధం చేసుకున్నట్టు వివరించారు. అత్యవసర సమయంలో కమ్యూనికేషన్ కోసం పోలీసు విభాగం 81 టవర్లతో వైర్ లెస్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. జేసీబీలు, యంత్ర పరికరాలను కూడా యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్టు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన సీఎం పశువులకు కావాల్సిన గ్రాసం కూడా సిద్ధంగా ఉంచాలని సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాన్ని,



చెట్లు, టవర్లు, హోర్డింగ్ లు పడిపోయిన ప్రాంతాలను గుర్తించి తక్షణం పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వర్ష ప్రభావంతో ఇప్పటి వరకూ 43 వేల హెక్టార్ల పంట నీట మునిగిందని అధికారులు తెలిపారు. కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నీటమునిగిందని సీఎంకు వివరించారు. అయితే పంట నష్టం వివరాలను రైతులు కూడా పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ లో మార్పు చేర్పులు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తుఫాను కారణంగా రోడ్లపై చెట్లు, విద్యుత్‌స్తంభాలు, రోడ్ల ధ్వంసం వంటివి జరిగితే ఊళ్ల మధ్య రాకపోకలకు ఇబ్బంది అవుతుందని... అలాంటి పరిస్థితి రాకుండా చూడాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్ర స్థాయి యంత్రాంగంతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని, అందరూ ఫీల్డులో ఉన్నారని మంత్రి నారా లోకేష్ సీఎంకు వివరించారు. ప్రస్తుతం రాయలసీమలో వర్షాలు లేనందున ఎగువ నుంచి వచ్చే కృష్ణా ప్రవాహాలను అక్కడి చెరువులు నింపే ప్రక్రియను చేపట్టాలని సీఎం జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఒక్క టీఎంసీ నీటిని కూడా కోల్పోకుండా నీటిని నింపే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, సీఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఇతర శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ప్రజల ఆకాంక్షల మేరకే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ

(మొదటి పేజీ తరువాయి)

**గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోనే సమస్య :** కొత్త జిల్లాల ఏర్పాటుపై గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం ప్రాంతీయ విభేదాలకు కారణమైందని, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోలేదని ముఖ్యమంత్రి అన్నారు. మరోవైపు భవిష్యత్‌లో చేపట్టే నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని జిల్లాల పునర్ వ్యవస్థీకరణ జరగాలని నిర్దేశించారు. రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణను ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. పోలవరం పూర్తయిన తర్వాత ముంపు మండలాల ప్రజలు ఏ రెవెన్యూ వార్డు, ఏ నియోజకవర్గంలో ఉంటారనేదానిపైనా అధ్యయనం చేసి... దానికి అనుగుణంగా పునర్ వ్యవస్థీకరణ జరపాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు ఆ ప్రాంత చిరకాల వాంఛ అని సీఎం ప్రస్తావించారు. తమ పరిశీలనకు వచ్చిన అంశాలను, ఆయా వర్గాల అభిప్రాయాలను మంత్రులు ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంగళవారం జరిగిన తొలి సమావేశంలో పలు అంశాలు చర్చించిన సీఎం... ప్రతిపాదనలపై తదుపరి చర్చలకు వారంలో మరోసారి సమావేశం అవుదామని తెలిపారు.

# రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనపై కసరత్తు పూర్తి..!


(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయం కారణంగా పలు చోట్ల ప్రజలకు ఇబ్బందులు, పరిపాలనలోనూ సమస్యలు తలెత్తుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని మంత్రులు తెలిపారు. ప్రజలు, నాయకులనుంచి మంత్రివర్గ ఉపసంఘానికి అందిన సూచనలు, ఫిర్యాదులను మంత్రివర్గ ఉప సంఘం నిషితంగా పరిశీలించి నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు. దీంతోపాటు ఉపసంఘం కొన్ని సూచనలను కూడా చేసినట్లు తెలిసింది.

ప్రజల సూచనలు, వారి సౌలభ్యం కోసం కొత్త జిల్లాలతోపాటు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు చేయాల్సివుందని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా జిల్లా కేంద్రాల మార్పు, జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పుపైనా చర్చించారు. ఈ విషయమై పలుమార్లు సమావేశమైన కేబినెట్ సబ్ కమిటీ వివిధ వర్గాలు, ప్రజాసంఘాల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల హామీ కావడంతో ఈ విషయంలో వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉమ్మడి నెల్లూరులో ఉంది అయితే దీనికొక శాస్త్రీయ భద్రత అవసరమని సీఎం భావిస్తున్నారు.

వైసీపీ హయాంలో కొత్త జిల్లాలు ఏర్పాటుచేసినా, ఇప్పటివరకు ఎక్కడా సొంతంగా కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించలేదని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా పార్లమెంటు నియోజకవర్గం ప్రాతిపదికగా జిల్లాలు విభజించడం వల్ల ప్రజలు తమ జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన సమయాల్లో దూరభారంగా ఫీల్ అవుతున్నారు. ఈ క్రమంలో జిల్లాల పునర్విభజనకు ప్రభుత్వం సమాయుత్తం అవడంతో చాలా చోట్ల నుంచి జిల్లా పరిధిని మార్చాలని ప్రతిపాదనలు వచ్చాయి. దీనిని మంత్రివర్గ ఉప సంఘం పలుసార్లు సమావేశమై నిశితంగా పరిశీలించింది.

**తాజా సమాచారం ప్రకారం :** శ్రీకాకుళం జిల్లాను పునర్విభజించి పలాస కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ ను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అదేవిధంగా గతంలో శ్రీకాకుళం జిల్లాలో ఉన్న రాజాం నియోజకవర్గం ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో ఉంది. దీన్ని మళ్లీ విడదీసి శ్రీకాకుళం జిల్లాలో కలపాలని ప్రతిపాదన తిర పైకి వచ్చింది. దీనిని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు విజయనగరం జిల్లాలో ఉన్న ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖలో కలపాలని ప్రతిపాదన ఉంది. కొత్తపేట, మండపేట అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రస్తుతం ఉన్న జిల్లాల నుంచి మార్చాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం నరసాపురంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ ఒకటుంది. కృష్ణా జిల్లాలో ఉన్న పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాలను విజయవాడ కేంద్రంగా ఉండే జిల్లాలో కలపాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాలు విజయవాడ నగరంలో అంతర్భాగంగా ఉంటాయి. వీటిని దూరంగా ఉండే మచిలీపట్నం కేంద్రంగా ఉండే కృష్ణా జిల్లాలో కలపడం వల్ల పాలనపరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక విజయవాడ,




గుంటూరులోని కొన్ని ప్రాంతాలను కలిపి అమరావతి ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. తాజా సమాచారం ప్రకారం అమరావతి జిల్లాలో పెదకూరపాడు, తాడికొండ, మంగళగిరి, జగ్గయ్యపేట,, నందిగామ నియోజకవర్గాలలో కలపాలనే ప్రతిపాదన కూడా ఉంది. అదేవిధంగా మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేసే ప్రతిపాదనను ప్రభుత్వం చర్చిస్తోంది. ఈ కొత్త జిల్లాలో రాయలసీమలోని కొంత ప్రాంతంతోపాటు ప్రకాశం జిల్లాలో కొన్ని ప్రాంతాలను విలీనం చేసే ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో రెవెన్యూ డివిజన్ల పునర్విభజన జరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కొత్త రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేస్తారని చెబుతున్నారు. దీనిపై మంత్రివర్గ ఉప సంఘం కూడా ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచింది. ఈ ప్రతిపాదనను ఇప్పటికే ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించారు. అనంతరం మంత్రుల గొప్ప సంఘం ఆమోదముద్ర వేసినట్లు చెబుతున్నారు. ఈ సిఫార్సులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం పరిశీలించడంతోపాటు మంత్రివర్గ ఉప సంఘంతో చర్చించినట్లు తెలుస్తోంది.

**డిసెంబర్ 31 లోగా ప్రక్రియ పూర్తి :** నవంబర్ 7న జరిగే కేబినెట్ సమావేశంలో ఆమోదం పొందిన తర్వాత, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, గెజిట్ విడుదల చేస్తారు. జనగణన కారణంగా డిసెంబర్ 31లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. ఏడుగురు మంత్రుల ఉపసంఘం తొలి సమావేశం ఆగస్టు 13న సచివాలయంలో జరగడంతో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఆ తర్వాత, జిల్లాల వారీగా కలెక్టర్లు ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. ఇది ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే ప్రయత్నంగా చెప్పవచ్చు. కేవలం ప్రజలే కాకుండా, మంత్రులు, శాసనసభ్యులు వంటి ప్రజాప్రతినిధులు కూడా తమ తమ ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థనలను ఉపసంఘానికి సమర్పించారు. మొత్తంగా, ఉపసంఘానికి దాదాపు 200 వరకు అర్జీలు అందాయని సమాచారం. ఈ అర్జీలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించడానికి, మూడు రోజుల క్రితం జరిగిన సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం విస్తృతంగా చర్చించింది. ఈ చర్చల్లో భాగంగా జిల్లాల అధికారుల నుంచి కూడా అభిప్రాయాలు సేకరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఏజెన్సీ ప్రాంతంలో కొత్త జిల్లా ఏర్పాటుపై హామీ ఇచ్చారు. రంపచోడవరం నుంచి పాడేరుకు 187 కి.మీ. దూరం ఉండటంతో, రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పాటు 4 విలీన మండలాలతో కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదన ఉంది. అలాగే పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నియోజకవర్గాలతో అమరావతి కేంద్రంగా మరో కొత్త జిల్లా ఏర్పాటు దిశగా ఆలోచన చేస్తున్నారట. అలాగే మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నివేదికను సిద్ధం చేస్తున్నారట. రాష్ట్రంలో కొత్త రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నారట. అద్దంకి, మడకశిరతో సహా 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెబుతున్నారు.

ఒకే నియోజకవర్గం రెండు, మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉంటే.. వాటిని ఒకే నియోజకవర్గంలోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదోని మండలంలో 1.50 లక్షల జనాభా ఉన్నారు.. దీంతో దానిని విభజించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలిస్తోంది. మండపేట, కొత్తపేట, ఎస్.కోట వంటి కొన్ని నియోజకవర్గాలను వేరే జిల్లాలకు మార్చాలనే ప్రతిపాదనలు కూడా అందాయి. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటుంది. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు, అద్దంకి, కందుకూరు నియోజకవర్గాల విలీనంపై కూడా కసరత్తు జరుగుతోంది. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. రామాయపట్నం పోర్టు ఉండటంతో కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలా లేక నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

# ఏపీలో రూ.765 కోట్లతో ఎలక్ట్రానిక్స్ తయారీ పరిశ్రమ

(మొదటి పేజీ తరువాయి)

1.42 లక్షల మందికి ఉపాధి : తమిళనాడులో కేనెస్ సర్క్యూట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నాలుగు యూనిట్లు, అస్సెంట్ సర్క్యూట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మరో యూనిట్ కలిపి మొత్తం రూ. 4,271 కోట్ల పెట్టుబడితో 5 యూనిట్లు ఏర్పాటు చేయనున్నాయి. ఎస్ఆర్ఎఫ్ లిమిటెడ్ అనే మరో సంస్థ రూ. 496 కోట్లతో మధ్యప్రదేశ్‌లో ఒక యూనిట్ నెలకొల్పనుంది. ఈ యూనిట్ల ద్వారా దేశీయంగా కాపర్‌క్లాడ్ లామినేట్ 100%, పీసీబీకి ఉన్న డిమాండ్‌లో 20%, కెమెరా మాడ్యూల్స్‌లో 15% అందుకోవచ్చని కేంద్ర మంత్రి అశ్వినీవైష్ణవ్ ప్రకటించారు. ఈ పథకం కింద దేశంలో యూనిట్ల ఏర్పాటు కోసం మొత్తం 249 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. రూ. 1.15 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడం ద్వారా రూ. 10.34 లక్షల కోట్ల ఉత్పత్తులు తయారు చేయడానికి, 1.42 లక్షల మందికి ఉపాధి కల్పించడానికి వీరు ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. ఇందులో ప్రస్తుతం రూ. 5,500 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపినట్లు వివరించారు.

**15 నెలల్లో 4.7 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం: సీఎం చంద్రబాబు**

ఇదిలా ఉండగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేంద్రం సహకారంతోపాటు సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టిసారించడంతో మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. నక్కపల్లి మండలంలో ఈ పరిశ్రమకు భూములు కేటాయించారు. అమలాపురం, డీఎల్‌పురం, వేంపాడు, చందనాడ తదితర ప్రాంతాల్లో 2020 ఎకరాలు ఇచ్చి మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఈ పనులన్నీ శరవేగంగా జరుగుతున్నాయి. రహదారులు, కాలువల నిర్మాణం పూర్తి కావచ్చింది. పైపులైను పనులు సాగుతున్నాయి. పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి నెల రోజుల కిందట ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా, అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. నవంబరులో జరగనున్న శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. వర్చువల్‌గా పాల్గొంటారా, ఇక్కడకు వస్తారా అన్నది ఖరారు కావాల్సి ఉంది. దాదాపు రూ. 1.35 లక్షల కోట్లతో ఏర్పాటయ్యే ఈ కంపెనీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 వేల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని అంచనా.

## ప్రజల భద్రతే కూటమి ప్రభుత్వ బాధ్యత



**నిడదవోలు, (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో వర్షంలోనే మంత్రి కందుల దుర్గేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం మండలంలోని మోర్త గ్రామ సచివాలయం దగ్గర వాహనాన్ని ఆపి వేగవంతమైన గాలుల ధాటికి రోడ్డుపై అడ్డంగా పడి ఉన్న చెట్లను, విద్యుత్ వైర్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను దగ్గరుండి తొలగించారు. అనంతరం తాడిపర్రు రోడ్డులోని హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది ఏర్పాటు చేసిన మందులను పరిశీలించారు. ప్రజలందరికీ అందుబాటులో స్టాక్ ఉందా అన్న వివరాలు తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. కానూరులో వాహనాన్ని ఆపి ప్రజలతో మాట్లాడి ధైర్యం చెప్పారు. సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చూపుతానన్నారు. అనంతరం నిడదవోలు రూరల్ మండలంలోని పెండ్యాల గ్రామంలో పర్యటించి స్థానికులతో తాజా పరిస్థితిపై మాట్లాడారు. రోడ్లపై తిరుగుతున్న ప్రజలకు తుఫాన్ పరిస్థితిని వివరించి ఇంటికి వెళ్లాలని సూచించారు, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, సహచర మంత్రులు మొంథా తుఫాన్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని, అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి తుఫాన్ ను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని ప్రజలకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాసంపై అధికారులకు మంత్రి దుర్గేష్ పలు సూచనలు చేశారు. రోడ్లపై చెట్లు పడిపోవడం, స్తంభాలు నేలకొరగడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కాలువలు, చెరువులు గండిపడకుండా నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ కు అంతరాయం కలిగితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. ప్రజలందరి భద్రత కోసం ప్రభుత్వం, నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు. భవిష్యత్ లో వచ్చే తుఫాన్ లను కూడా ఎదుర్కొనేందుకు ఎస్ వోపీ సిద్ధం చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి దుర్గేష్ తెలిపారు. కొందరు ప్రజల్లో లేనిపోని ఆందోళనలు సృష్టిస్తున్నారని, ఈ సమయంలో సామాజిక బాధ్యతతో మెలగాలని, ఎవరూ రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. ప్రజల భద్రతే కూటమి ప్రభుత్వ బాధ్యత అని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

## తుఫాను ప్రభావంపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి నిరంతర పర్యవేక్షణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నష్టం, పునరుద్ధరణ చర్యలను రహదారులు మరియు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ముంబయి నుంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రాబోయే 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్&బీ శాఖ ఈఎన్సీ, చీఫ్ ఇంజనీర్లు, ఎస్ఈలకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఆయన ఆదేశాల మేరకు అన్ని డివిజన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు పరిస్థితులు కుదుటపడేవరకు అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశించారు. తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రహదారులకు తీవ్ర నష్టం సంభవించింది. మంగళవారం సాయంత్రం నాటికి దాదాపు 1,632 కిలోమీటర్ల మేర ఆర్&బీ రహదారులు ధ్వంసమయ్యాయి. 69 చోట్ల రహదారులు గోతులతో దెబ్బతినగా, ఇప్పటివరకు 16 చోట్ల పునరుద్ధరణ పూర్తయింది. 21 చోట్ల రహదారులు కోతకు గురికాగా, 6 చోట్ల పునరుద్ధరణ పనులు పూర్తి చేశారు. కల్వర్టులు 144 చోట్ల ధ్వంసమవగా, వాటిలో 36 చోట్ల పునరుద్ధరణ చేపట్టారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల 66 చోట్ల చెట్లు రోడ్లపై పడగా, 62 చెట్లను ఇప్పటికే తొలగించారు. తుఫాను ప్రభావంతో దాదాపు 130 చోట్ల రహదారులపై నీరు ప్రవహించగా, 92 చోట్ల ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. అందులో 21 చోట్ల రవాణా సదుపాయాలను పునరుద్ధరించారు. తాత్కాలిక రహదారి మరమ్మతులకు రూ. 98.71 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 897.38 కోట్లు అవసరమని, మొత్తం రూ. 981.91 కోట్ల వ్యయంతో రహదారుల పునరుద్ధరణ అవసరమని ఆర్&బీ శాఖ అంచనా వేసింది.

# పిఠాపురంలో మొంథా తుపాను అప్రమత్తత



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** మొంథా తుపాను ప్రభావం పిఠాపురం నియోజకవర్గంపై తీవ్రంగా ఉండనున్న నేపథ్యంలో స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, సర్వ సన్నద్ధతతో ఏర్పాట్లు చేశారు. పవన్ కళ్యాణ్ నిరంతరం నివేదికలు విశ్లేషించి అధికారులతో చర్చిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఉప్పాడ, మూలపేట, కోనపాపపేట తదితర తీర ప్రాంత గ్రామాల్లో సహాయక చర్యల పర్యవేక్షణకు గ్రామానికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. 34మంది సభ్యులతో ఒక ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందం పిఠాపురం నియోజకవర్గంలో అప్రమత్తంగా ఉంది. 34 బోట్లు సిద్ధం చేశారు. వీరికి తోడుగా 12 మంది సభ్యుల క్విక్ రెస్పాన్స్ టీమ్ సభ్యులు, 12 మంది గజ ఈతగాళ్ళు ఉన్నారు. పిఠాపురం కేంద్రంగా ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందం పని చేస్తోంది.

**అనుక్షణం అప్రమత్తం :** కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తో టెలీ కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తూ కాకినాడ జిల్లాలో ఉన్న తుపాను ప్రభావ పరిస్థితులను ఉప ముఖ్యమంత్రి సమీక్షిస్తూ ఉన్నారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంట గంటకు నివేదికలు తీసుకుంటున్నారు. జిల్లాతోపాటు పిఠాపురం నియోజకవర్గంలో పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు.

పిఠాపురం నియోజకవర్గంలో 25 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడి ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సమీక్షిస్తుంది. ఆహారం, తాగునీరు, పాలు, అత్యవసర ఔషధాలను సమకూర్చి, వైద్య ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు నేల కూలితే తక్షణమే స్పందించేలా వ్యవస్థను సన్నద్ధం చేయడంతోపాటు 500 స్తంభాలను స్టాండ్ బైగా ఉంచారు. అలాగే పశువులకు ఇబ్బంది లేకుండా అవసరమైన పశు గ్రాశాన్ని కూడా గ్రామాల్లో ఉంచారు. వీటిపాటు ఉప ముఖ్యమంత్రివర్యుల ఆదేశాలను అనుసరించి– ఆకస్మిక వరదల హెచ్చరిక నేపథ్యంలో జల వనరుల శాఖ సిబ్బందిని సమాయత్తం చేశారు. పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయం చేసుకొంటున్నారు. పడా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాల్లో పరిస్థితులను పర్యవేక్షించేందుకు గ్రామానికి ఒకరు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. ఉప్పాడలో బీసీ కార్పోరేషన్ ఈడీ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మూలపేట, కోనపాపపేటల్లో డివిజన్ లెవల్ డెవలప్మెంట్ అధికారులను నియమించారు. అమీనాబాద్, అమరవిల్లిలలోనూ ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయి సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. పునరావాస శిబిరాల్లో ఉంటున్న ప్రజలకు ఆహారం ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు డి.డి.ఓ.ను, పెదపూడి తహసిల్దార్ లను నియమించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బంది మొత్తం సహాయక చర్యల్లో పాలు పంచుకుంటున్నారు. గ్రామీణ నీటి పారుదల శాఖ డి.ఇ. ఆధ్వర్యంలో రక్షిత తాగు నీరు ఏర్పాటు చేశారు. పునరావాస శిబిరాల్లో 12 వేల మందికి మధ్యాహ్న భోజనం, 15 వేల మందికి రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. 5 వేల పాల ప్యాకెట్లు, 1.50 లక్షల వాటర్ ప్యాకెట్లతోపాటు వాటర్ ట్యాంకర్లను కూడా సిద్ధం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో ఎలాంటి ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## విద్యుత్ శాఖ చర్యలు - 1,000 బృందాలు, 12 వేల మంది సిబ్బంది

(మొదటి పేజీ తరువాయి)

విపత్కర పరిస్థితుల్లోనూ విద్యుత్ పనులు నిర్వహించే విధంగా ఎక్కడికక్కడ ప్రైవేటు కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. రాబోయే 48 గంటలు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఉన్నత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తుపాన్ ప్రభావం వల్ల విద్యుత్ సంస్థల్లో పనిచేసే సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. మూడు డిస్కంల పరిధిలో సరఫరా పునరుద్ధరణ పనులకు 1,000 బృందాలు, సుమారు 12,000 మంది సిబ్బందిని సిద్ధంగా ఉంచారు.

ఈపీడీసీఎల్‌లో అధిక ప్రభావం: వాతావరణ శాఖ నివేదికల ప్రకారం తుపాను ప్రభావం ఈపీడీసీఎల్ పరిధిలో ఎక్కువగా ఉంటుందని అంచనా. దీని దృష్ట్యా ప్రభావం తక్కువగా ఉన్న ఎస్పీడీసీఎల్ నుంచి మెటీరియల్, సిబ్బందిని అక్కడికి పంపారు. ఉమ్మడి విశాఖపట్నం, ఉభయ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో తక్షణ మరమ్మతుల నిర్వహణకు 496 బృందాలు, 7,394 మంది సిబ్బందిని సిద్ధంగా ఉంచారు.

సీపీడీసీఎల్ పరిధిలోనూ సన్నద్ధం: సీపీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల్లో పనుల నిర్వహించేందుకు 285 మంది కాంట్రాక్టర్లను నియమించారు. అలాగే 2,913 మంది వర్కర్లను సిద్ధంగా ఉంచారు.

ఎస్పీడీసీఎల్ పరిధిలో: ఎస్పీడీసీఎల్ పరిధిలో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో తీర ప్రాంతం వెంట ఉండే సుమారు 26 మండలాల్లో తుపాను ప్రభావం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకే 10 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

ఉత్పత్తికి ఇబ్బంది లేకుండా: తుపాను నేపథ్యంలో జెన్‌కో థర్మల్ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రమాదవశాత్తు వరద నీరు వస్తే తోడి పోసేందుకు విజయవాడ వీటీపీఎస్‌లో 104 పంప్‌లు సిద్ధంగా ఉంచారు. కడప ఆర్టీపీపీలో 20, కృష్ణపట్నంలో 10 మోటార్లు ఏర్పాటు చేశారు.

యుద్ధ ప్రాతిపదికన సరఫరా పునరుద్ధరించాలి: విద్యుత్ సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సీఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు. తుపాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలను డిస్కంల సీఎండీలు, జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో ఆయన సమీక్షించారు.

రియల్‌టైమ్‌లో సమాచారం అందించండి – తుపాను సన్నద్ధతపై సీఎం ఆదేశాలు

మొంథా తుపాను ప్రభావంతో ఎక్కడా ప్రమాదాలు జరగకుండా, ఒక్క ప్రాణ నష్టం కూడా సంభవించకూడదనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో తుపాను పరిస్థితులపై పీఎం నరేంద్ర మోదీ ఆరా తీశారని తెలిపారు. కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రధాని భరోసా ఇచ్చినట్లు వెల్లడించారు. పీఎం కార్యాలయంతో సమన్వయం చేసే బాధ్యతను మంత్రి లోకేశ్‌కు అప్పగించారు. తుపాను రక్షణ చర్యల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఉదయం ఆర్టీజీఎస్‌లో తుపాను సన్నద్ధత, జిల్లాల స్థితి గతులపై సమీక్ష నిర్వహించిన సీఎం, అధికారులకు తగిన సూచనలు చేశారు.

## మొంత తుఫానుపై ప్రభుత్వం పూర్తి సిద్ధం



**మచిలీపట్నం(జర్నలిస్ట్ ఫైల్ ):** మొంత తుఫానును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కార్మికులు, కర్మాగారాలు, బాయిలర్లు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మంగళవారం ఆయనతో పాటు గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తాళ్లపాలెం పంచాయతీ గిరిపురంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపుకు 222 పునరావాస కేంద్రాలను గుర్తించి, 162 కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం 2,497 కుటుంబాలు ఈ కేంద్రాల్లో తలదాచుకున్నాయని, వారికి మంచినీరు, ఆహారం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచామని వివరించారు. రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు మచిలీపట్నం, గుడివాడల్లో సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే నావికాదళం, సైనిక దళాలను కూడా వినియోగించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

**తుఫాను ప్రభావం తక్కువగా ఉండేలా ముందస్తు చర్యలు :** మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తీవ్రమైన మొంత తుఫానుగా రూపాంతరం చెందిందని తెలిపారు. ఈ రాత్రి మచిలీపట్నం–కాకినాడ మధ్య తీరం దాటే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం ఈదురుగాలులు గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వీస్తున్నాయని, చెట్లు, గోడలు కూలే ప్రమాదం ఉన్నందున ప్రజలను యుద్ధప్రాతిపదికన సురక్షిత కేంద్రాలకు తరలిస్తున్నామని వివరించారు. మచిలీపట్నంలో ఇప్పటివరకు 21 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, వర్షం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకుంటోందని, ప్రజలు బయటకు రాకుండా సురక్షితంగా ఉండాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు.

## గన్నవరం విమానాశ్రయంలో అగ్ని ప్రమాదం




**గన్నవరం(జర్నలిస్ట్ ఫైల్ ):** గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఎయిర్‌పోర్టులోని కస్టమ్స్ అధికారుల గదిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో సాఫ్ట్‌వేర్ బాక్సులు, ఇమ్మిగ్రేషన్ గదిలోని ఎసి, కస్టమ్స్ అధికారుల వస్తువులు దగ్ధమయ్యాయి. ఎయిర్‌పోర్టు సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. ఈ సంఘటన ఎలాంటి ప్రభావాన్ని చూపలేదని, ప్రయాణికుల సదుపాయాలతో సహా అన్ని సేవలు సాధారణంగా కొనసాగుతున్నాయని ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు.

## బీసీ హాస్టల్ విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుందాం



**తాడేపల్లి/అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్) :** మొంథా తుఫాన్ నుంచి బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుందామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రివర్యులు ఎస్.సవిత ఆదేశించారు. తుఫాన్ తీవ్రంగా ఉండే ప్రాంతాల్లోని విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలతతో మంత్రి సవిత మంగళవారం సమావేశమయ్యారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో బీసీ హాస్టళ్ల విద్యార్థుల రక్షణకు తీసుకున్న చర్యల గురించి జిల్లాల వారీగా మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. పలువురు డీబీసీడబ్ల్యూవోలతోనూ మంత్రి స్వయంగా ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి సవిత సవిత మాట్లాడుతూ, వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, ప్రిన్సిపాళ్లు 24 గంటలూ హాస్టళ్లలో ఉండడడంతో పాటు రాత్రి సమయంలో విద్యార్థులతో కలిసి నిద్రపోయేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న హాస్టళ్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే అందివ్వాలన్నారు. బయట ఆహారాలను హాస్టళ్లలోకి అనుమతించొద్దన్నారు. తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ కోతలు ఉండే అవకాశముందని, ఇన్వర్టర్లను పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. టార్చిలైట్లు, క్యాండిల్స్, అగ్గి పెట్టెలను పెద్ద మొత్తంలో ముందు జాగ్రత్తగా సమకూర్చుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ల ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటించాలన్నారు. విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్యులతో వైద్య సేవలందించాలన్నారు. హాస్టళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చేయాలని స్పష్టంచేశారు. మరుగుదొడ్లు, బాత్ రూమ్ లను శుభ్రం చేయాలన్నారు. దోమలు చొరబకుండా హాస్టళ్ల గదుల కిటికీల వద్ద మెస్ లు ఏర్పాటు చేయాలన్నారు. తుఫాన్ దృష్ట్యా హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను నిరంతరం పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు వాటి స్థితిగతులు, విద్యార్థుల ఆరోగ్యంపై నివేదిక ఇవ్వాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణను, ఎంజేపీ స్కూల్ కార్యదర్శి మాధవీలతను మంత్రి సవిత ఆదేశించారు. హాస్టళ్ల విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోవాలని, వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో పలువురు బీసీ సంక్షేమ శాఖాధికారులు పాల్గొన్నారు.

# తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నాం..



**మచిలీపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :**అధికారుల సమన్వయంతో జిల్లాలో మొంథా తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

మంగళవారం మధ్యాహ్నం మంత్రి కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మొంథా తుపాను జిల్లా ప్రత్యేక అధికారి, పర్యాటక శాఖ ఎండి, కాట ఆమ్రపాలి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుతో కలసి తుపాను ప్రభావంతో జిల్లాలో సంభవించనున్న భారీ వర్షాలు, ఈదురు గాలులకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఉండేందుకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై శాఖల వారీగా అధికారులతో చర్చించారు.

తీరం దాటే సమయంలో అధిక వర్షాలు కురిసినప్పుడు నగరంతోపాటు పంట పొలాలకు ముంపు ప్రభావం తలెత్తకుండా ఉండేందుకు ముందుగానే ప్రధాన డ్రైనేజీలు అయిన శివగంగ, గుండేరు, లజ్జబండ మురుగు కాలవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి గండ్లు పడకుండా బలహీనంగా ఉన్న చోట్ల కట్టలను బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ తుఫాను ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు శాయశక్తులా కృషి చేయాలని అధికారులను కోరారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మచిలీపట్నం కాకినాడ మధ్య మొంథా తుపాను తీరం దాటనున్నదని తెలుపుతూ, దాని పర్యవసానాలను ఎదుర్కొనేందుకు అన్ని విధాల సిద్ధంగా ఉన్నామని తెలిపారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు ప్రాంతం వరకు తుఫాను ప్రభావం ఉండనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించి కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి రియల్ టైం గవర్నెన్స్ సొసైటీ (ఆర్టిజిఎస్) వ్యవస్థ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో కూడా జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి జిల్లా ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితులను సమీక్షిస్తోందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు జిల్లాలో ఇప్పటికే దాదాపు 165 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 6 వేల మందికి పైగా ప్రజలకు పునరావాసం కల్పించి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ తుపాను వల్ల సుమారు 16 వేల మందికి పైగా ప్రభావం చూపే అవకాశం ఉందని, మిగిలిన వారిని కూడా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామన్నారు. ఈ విపత్తు వల్ల ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా ఉండే విధంగా ప్రభుత్వ పరంగా అన్ని రక్షణ చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. తీరం దాటే సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని చెబుతూ, ప్రజలందరూ దీనిని దృష్టిలో పెట్టుకొని సురక్షితమైన ప్రాంతాలలో ఉండాలని కోరారు.

జిల్లా ప్రత్యేక అధికారి కాట ఆమ్రపాలి మాట్లాడుతూ తుఫాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని ప్రణాళికలతో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని అన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం, మురుగు కాలువలు పొంగిపొర్లకుండా అడ్డంకులు తొలగించడం, విద్యుత్ స్తంభాల కూలిపోతే పునరుద్ధరించడం, రహదారులు కొట్టుకుపోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా అధికారులతో కూడిన బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో లోతట్టు ప్రాంతంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వారికోసం 165 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రస్తుతానికి 6,618 మంది ప్రజలను తరలించి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఇంకా రావలసిన వారిని కూడా తరలించేందుకు అన్ని ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తీరం దాటే సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని, ఆలోపుగానే అవసరమైన నిత్యవసర సరుకులతోపాటు పిల్లలకి అవసరమైన పాలు, పండ్లు, ఔషధాలు, సరిపడ తాగునీరు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ ఉపకరణాలు పాడవకుండా ఉండేందుకు స్విచ్లు ఆఫ్ చేసుకోవాలని సూచించారు. తుపాను వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిన వెంటనే పరిస్థితులను పునరుద్ధరించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామని, మొత్తంగా తుఫాను పరిస్థితులను అధిగమించేందుకు అన్ని విధాలుగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, ఏఎస్పి సత్యనారాయణ, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) ఛైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ జెడ్పిటిసి లంకే నారాయణ ప్రసాద్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ముస్లిం సోదరులకు న్యాయం చేయాలి

మైలవరం, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్)

మైలవరం మండలం వెల్వడం మరియు పొందుగల గ్రామం నివసిస్తున్న నూరు భాష దూదేకుల ముస్లిం సోదరులు ఎవరైతే ఉన్నారో వాళ్ళ యొక్క స్మశాన వాటిక కు వెళ్ళుటకు దారి లేక చాలా అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా పొందుగల గ్రామంలో నివసిస్తున్న 30 కుటుంబాలు స్మశాన వాటికకు వెళ్ళుటకు దారి లేక అవస్థలు పడుతున్నారు. ఎవరైనా చనిపోతే తీసుకువెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. దయచేసి మాకు తగిన న్యాయం చేయగలరని అలాగే వెల్వడం గ్రామంలో 30 కుటుంబాలు నివసిస్తున్నారు. ఈ రెండు గ్రామాలలో నివసిస్తున్న నూరు భాష దూదేకుల ముస్లిం సోదరులకు న్యాయం చేయగలరని ఎన్టీఆర్ జిల్లా నూర్ భాషా దూదేకుల మాజీ చైర్మన్ పులివెందుల ఓ రసూల్ కోరారు. కార్యక్రమం లో ఏలూరు గాజులు బాజీ జిల్లా జాయింట్ సెక్రెటరీ హుస్సేన్ జాయింట్ సెక్రెటరీ షేక్ నాగూర్ వలి మైలవరం మండలం ప్రెసిడెంట్ షాజహాన్ జాయింట్ సెక్రెటరీ షేక్ అహ్మద్ రెడ్డిగూడెం మండలం షేక్ ఆదం మరియు వెల్వడం గ్రామం పొందుగల గ్రామ నూర్ భాషా ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## యశిల్ కుకునూరి చెస్ టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం



తాడేపల్లిగూడెం, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్)

కర్నూలులో జరిగిన 10వ ఆంధ్రప్రదేశ్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో తాడేపల్లిగూడెం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి యశిల్ కుకునూరి ప్రథమ స్థానం సాధించాడు. 3వ తరగతి చదువుతున్న యశిల్, ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ మరియు ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో అండర్-06 విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచాడు. యశిల్ విజయం తో పాఠశాల గర్వపడుతోందని ప్రిన్సిపాల్ ఎన్. ఉమా శ్రీనివాస్ తెలిపారు.

## పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం



గూడూరు, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్)

గూడూరు పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఉదయం పోలీస్ స్మారక దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్యోతి రావు పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్ బాలికలు, విద్యార్థులు పాల్గొన్నారు. పోలీస్ అధికారులు విద్యార్థులకు పోలీస్ శాఖలో జరిగే వివిధ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. స్టేషన్‌కు వచ్చినప్పుడు రిసెప్షన్ డెస్క్ వద్ద మొదట సమాచారం ఇవ్వాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళల సహాయ కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. భార్యాభర్తల మధ్య వివాదాలు లేదా మహిళలపై అనుచిత ప్రవర్తన జరిగితే ఆ కేంద్రం ద్వారా సహాయం పొందవచ్చని వివరించారు. అదేవిధంగా వైర్‌లెస్ సెట్ ఉపయోగం, స్టేషన్ రికార్డుల భద్రత, డయల్ 100 సేవ ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించారు. సిగ్నల్ లేకున్నా డయల్ 100 ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరుతుందని, అక్కడి నుండి సమీప పోలీస్ స్టేషన్లకు సమాచారం పంపిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన పెంచుకున్నారు. పోలీస్ అధికారులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## తుఫాన్ ముందస్తు సహాయక చర్యల్లో గన్నవరం పోలీసులు, రెవెన్యూ అధికారులు



గన్నవరం, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్)

గన్నవరం మండలంలోని చిక్కవరం గ్రామం సమీపంలోని బ్రాహ్మలింగయ్య చెరువుకు వరద నీరు పెరగడంతో చీమల వాగు పొంగి చిక్కవరం గ్రామానికి వరదనీరు రాకుండా సహాయక చర్యలు చేపట్టారు. గ్రామ సమీపంలోని కొండమొర్రు డ్యాం వద్ద నుండి వచ్చే వాగు వల్ల గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గన్నవరం పోలీసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. ఆగిరిపల్లి మండలం, తోటపల్లి ప్రాంతంలో ఉన్న బ్రాహ్మలింగయ్య చెరువు నుండి చీమలవాగు, కొండమొర్రు డ్యాం ద్వారా ఎక్కువ మొత్తంలో నీరు రావడంతో ఆ నీటిని చీమల వాగుకు తరలించేందుకు ముమ్మరంగా పనులు చేస్తున్నారు. గన్నవరం ఎస్సై కిషోర్, గ్రామ సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, పంచాయితీ కార్యదర్శి హర్షవర్ధని, విఆర్ఓ మూర్తి, నీటి సంఘం ప్రెసిడెంట్ చిట్టినేని శివరామకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ నిమ్మగడ్డ యేసుబాబు, గ్రామ ప్రముఖులు, రేవూరి శివరామకృష్ణ, చిట్టి నేని జోజిబాబు గ్రామ పంచాయితీ సిబ్బంది కలసి, కొండమొర్రు వాగు ఉధృతి పెరగకుండా ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. గ్రామాన్ని తుఫాన్ ప్రభావం పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్న ఎస్సై కిషోర్, పంచాయితీ సిబ్బందిని గ్రామస్తులు అభినందనలతో ముంచెత్తారు.

### 2న తితిదే ఆధ్వర్యంలో నాలుగు ఎస్సీ కాలనీలలో

# మంగళ కైశిక ద్వాదశి వేడుకలు





- తి.తి.దే. హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి

నంద్యాల, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్)

కార్తిక శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణం, పొన్నాపురం, ఎస్సీకాలనీలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి దేవస్థానం, ఆళ్ళగడ్డలోని ఆదర్శ అభ్యుదయ నగర్ కాలనీలోని శ్రీరామాలయం, కోడుమూరు మండలం, వర్కూరు గ్రామం, ఎస్సి కాలనీలోని శ్రీరామాలయం, గూడూరు మండలం, పెంచికలపాడు గ్రామం, ఎస్సీకాలనీలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం మొత్తం నాలుగు ఎస్సీ కాలనీలలోని దేవాలయాలలో కార్తిక శుద్ధ ద్వాదశిని పురస్కరించుకుని మంగళ కైశిక ద్వాదశి కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణం, పొన్నాపురం, ఎస్సీ కాలనీనందు ఆ సామాజిక వర్గానికి చెందిన వారితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సత్యవంతుడు అనే మాల దాసరి తన సత్యనిష్ఠ ద్వారా శ్రీమహావిష్ణువుని ఏ విధంగా సేవించి విష్ణు పదం పొందాడో తెలుపుట కొరకు, హరిదాసులను ప్రోత్సహించుటకై తిరుమల తిరుపతి దేవస్థానములు ఉమ్మడి రాష్ట్రం అంతటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నదని, అందులో భాగంగానే ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. రామనరసింహులు, ఆ సామాజిక సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# లంగరే సయ్యద్ షాబుకారి నిర్వహించడం అదృష్టం





- జంపని షరీఫ్ ఆస్థాన నిర్వాహకులు హజరత్ అతా నిజాముద్దీన్ తాజ్ ఖాద్రి బాబా (అతా నిజామ్ బాబా)

విజయవాడ, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్)

సూఫీ మహాత్ములు చూపిన మార్గం ప్రకారం ఆకలిగొన్న వారి కడుపు నింపేందుకు లంగర్ (అన్న ప్రసాద వితరణ ) నిర్వహిస్తూ ప్రపంచ ప్రాఖ్యతి గాంచిన చీమలపాడు షరీఫ్ సూఫీ హజరత్ మొహమ్మద్ అతా ఉల్లా తాజ్ ఖాద్రి బాబా అడుగుజాడల్లో నిత్యాన్న దానాన్ని నిర్వహించడం జరుగుతుందని జంపని షరీఫ్ ఆస్థాన నిర్వాహకులు హజరత్ అతా నిజాముద్దీన్ తాజ్ ఖాద్రి బాబా (అతా నిజామ్ బాబా) పేర్కొన్నారు. ఆయన సోమవారం కొండపల్లి హజరత్ సయ్యద్ షా బుఖారి దర్గా షరీఫ్ లో ఆయన లంగరే సయ్యద్ షాబుకారి పేరుతో మహా అన్నదానం నిర్వహించడం జరిగింది. తొలుత బాబా దర్గా లో ఫకిర్ల తో కలిసి పూలు,చాదర్, గంధం సమర్పించారు. ఈ సందర్భంగా నిజామ్ బాబా మాట్లాడుతూ లోకకళ్యాణం కాంక్షతో చేసే ప్రతి కార్యక్రమానికి దేవుని ఆశీస్సులు తప్పక ఉంటాయ న్నారు. కొండపల్లి సయ్యద్ షా బుఖారి ఆస్తానా లో లంగరే షా బుఖారి నిర్వహించడం తన అదృష్టం అని నిజామ్ బాబా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చీమలపాడు షరీఫ్ బడే సజ్జదా నషీన్ మొహమ్మద్ జాఫర్ సాధిక్, సూఫీ ప్రముఖులు మొహమ్మద్ అల్తాఫ్ అలీ రజా, మొహమ్మద్ అలీ జిన్నా తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రాల్లో అత్యంత నాణ్యమైన సౌకర్యాలు

- పారిశుద్ధ్యంపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలి
- ఎన్టీఆర్ జిల్లాలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సుడిగాలి పర్యటన
- క్షేత్రస్థాయి అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం



విజయవాడ, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్)

ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం జిల్లాలో సుడిగాలి పర్యటన చేశారు. మొంథా తుపాను నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా క్షేత్రస్థాయిలో చేసిన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. విజయవాడ అర్బన్ పరిధిలో సున్నపుబట్టీల సెంటర్, గ్రంథాలయ రోడ్డు ప్రాంతంలో ఈ నెల 24న కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని కలెక్టర్ లక్ష్మీశ.. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడే ప్రమాదమున్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని.. పరిస్థితిని అంచనా వేసి నివాసితులను పునరావాస శిబిరాలకు తరలించి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రమాదం పొంచి ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనౌన్స్‌మెంట్ల ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మునిసిపల్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో నిరంతర పర్యవేక్షణ పెట్టాలన్నారు. మొగల్రాజపురం బీఎస్ఆర్‌కే మునిసిపల్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి.. అక్కడ ఏర్పాటుచేసిన వైద్య శిబిరంతో పాటు బెడ్లు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, బెడ్డింగ్ మెటీరియల్, పారిశుద్ధ్యం.. ఇలా ప్రతిఒక్కటీ అత్యంత నాణ్యంగా ఉండాలని స్పష్టం చేశారు. పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్డులోని విపత్తు ప్రతిస్పందన పాయింట్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నగర పర్యటన అనంతరం వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద పరిస్థితిని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ప్రత్యేక బృందాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

### పంట పొలాల్లో నీరు నిలిచిపోకుండా చూడాలి

గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాల్లో నీరు నిలిచిపోకుండా చూడాలని.. వర్షపు నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా డ్రెయిన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. గుర్రపుడెక్క వంటివి ఉంటే వెంటనే తొలగించేలా చూడాలన్నారు. గ్రామ ప్రజల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో షిఫ్టల వారీగా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# ఉత్సాహంగా ముగిసిన రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలు





విజయవాడ, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్)

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ లాల్ బహదూర్ శాస్త్రి నగర్ లోని వంగవీటి మోహనరంగా కమ్యూనిటీ భవనంలో గత రెండు రోజులుగా ఎంతో ఉత్సా హంగా కొనసాగుతున్న ఆరవ రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి నిర్వహిం చిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావు తనయుడు, టిడిపి యువ నాయకులు బోండా సిద్ధార్థ ముఖ్యఅతిథిగా పాల్గొన్నా రు. ఈ సందర్భంగా బోండా సిద్ధార్థ మాట్లాడుతూ జంప్ రోప్ క్రీడ ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో అభివృద్ధి చెందుతుందని మన జిల్లా నలుమూలల కూడా ఈ క్రీడను అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. అనంతరం క్రీడల బట్టల స్థానిక ఎమ్మెల్యే బోండా ఉమా గారికి ఎంతో మక్కువ ఉందని క్రీడలను క్రీడా కార్యక్రమాలను ప్రోత్సహించడానికి ఆయన ఎప్పుడు ముందుంటారని అన్నారు. పోటీల నిర్వాప ాకులు అంతర్జాతీయ క్రీడాకారుడు విజయ్ కుమార్ గోగులమూడిని అభినందించారు. భవిష్యత్తులో మన జిల్లా తరఫున మన నియోజకవర్గంలో ఇటువంటి కార్యక్రమాలను మరెన్నో నిర్వహించాలని, నిర్వహణ కు అవసరమైన అన్ని సదుపాయాలని కూడా సమకూర్చ డానికి వెనకడుగు వేయమని అన్నారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ జంప్ రేపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సివి సుబ్బయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో జంప్ రోప్ క్రీడకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జంప్ రోప్ గౌరవ అధ్యక్షులు రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సీవి సుబ్బయ్య, జిల్లా కార్యద ర్శులు, సాంబశివరావు, గురుమూర్తి, అనిల్, మురళి, 62వ డివిజన్ ఇంచార్జి పైడి శీను, అధ్యక్షులు జలగం రాజా రావు, కార్యదర్శి శనగల మరియా బాబు, ఉపాధ్యక్షులు పోకతోట శివకృష్ణ, మైనారిటీ సెల్ నెంబర్ షైక్ బాషా, యూత్ విభాగ మెంబెర్ దూత బాలరాజు, న్యాయవాదులు ఉపాధ్యాయులు పోకతోట సుమలత, షేక్ నసీమా, పెదపాటి సంధ్యారాణి పాల్గొన్నారు.

# పోలీసులతోపాటు, జనం ముందుకు రావాలి

**పాతబస్తీ పేట్లబుర్జు సిఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డిజిపి బి.శివధర్‌రెడ్డి**

**హైదరాబాద్ (చార్మినార్), అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రక్తదానం ప్రాణ దానంతో సమానమని, ప్రతీ ఒక్కరూ రక్త దానం చేయటానికి ముందు రావాలని రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పాతబస్తీ పేట్లబుర్జులోని సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని డిజిపి బి.శివధర్‌రెడ్డి నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయటం వల్ల ముగ్గురి ప్రాణాలను రక్షించిన వారమవుతామని, పోలీసులతోపాటు ప్రజలు కూడ రక్తదానం చేయటానికి ముందుకు రావాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రతీ సంతవ్సరం ఎనిమిది వేల మంది చని పోతున్నారని, వారిలో చాలామందికి సకాలంలో రక్తం అందక పోవటం ఒక కారణమని ఆయన తెలియజేశారు. కోవిడ్ సమయంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఉన్న వి.సి.సజ్జనార్ ఎన్నో సేవలు చేశారని, నగరంలో పెద్ద ఎత్తున రక్తదానం శిబిరాలను నిర్వహిం చటంపట్ల డిజిపి బి.శివధర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ దాతలను అభినందించారు.

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ మాట్లాడుతూ నగరంలోని అన్ని జోన్లలో పన్నెండు రక్తదాన శిబిరాలను నిర్వహించి 3,500 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విధి నిర్వహణంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలకు నివాళిగా ఈ మెగారక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు. జంటనగరాలలోని అబిడ్స్ డివిజన్ కార్యాలయం, మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ (అంబర్‌పేట్), జయగార్డెన్ (పంజగుట్ట/బంజారా ఫంక్షన్‌హాల్) మాసాబ్ ట్యాంక్, పద్మశాలి భవన్ (సికిందరాబాద్), బషీర్ ఫంక్షన్‌హాల్ (సౌత్‌జోన్), కింగ్ క్లాసికల్ ఫంక్షన్ హాల్ (గుడ్డిమల్కాపూర్), సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ (పేట్లబూర్జు)లో సోమవారం రక్తదాన శిబిరాలను నిర్వహించారు.



రక్తదానం చేసిన దాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డిజిపి బి.శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ తదితరులు

రక్త దానం చేసిన దాతలకు డిజిపి శివధర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి (క్రైమ్) ఎం.శ్రీనివాస్, జాయింట్ సిపి (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి, డిసిపి స్పెషల్ బ్రాంచి కె.అపూర్వ రావు, ట్రాఫిక్ డిసిపి ఆర్.వెంకటేశ్వర్లు, సౌత్ వెస్ట్ జోన్ డిసిపి జి.చంద్ర మోహన్, ఉమెన్ సేఫ్టీ డిసిపి లావణ్య నాయక్ జాదవ్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, పలు బ్లడ్‌బ్యాంక్‌ల ప్రతినిధులు, డాక్టర్లు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో అవగాహన వారోత్సవాలు

### లోగో, టోల్‌ఫ్రీ నంబర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అవగాహన వారోత్స వాలు సోమవారం ఘనంగా మొదల య్యాయి. బీఆర్‌కె భవన్‌లోగల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగం ప్రధాన కార్యాలయంలో ఈ సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ విశ్రాంత ఐఎఎస్ అధికారి ఎం.జి గోపాల్ విజిలెన్స్ విభాగానికి సంబం ధించిన లోగోతోపాటు టోల్ ఫ్రీ నంబర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి శిఖా గోయల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నా రు. ఈ అవగాహన వారోత్సవాలు వారం రోజులపాటు జరుగుతాయి. ఈ ఏడాది థీమ్ విజిలెన్స్ పేరిట అవగాహన వారోత్సవాలు జరపనున్నామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డిజి డిజి శిఖా గోయల్ ఈ సందర్భంగా తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను టోల్ ఫ్రీ నంబర్ 14432కు తెలపవచ్చని ఆమె కోరారు. దీంతో పాటు ట్విటర్, ఇన్‌స్టాగ్రామం ఖాతాలను కూడా ఆమె ప్రారంభించారు. కాగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అవగాహన వారోత్సవాల సందర్భంగా రూపొందించిన ప్రత్యేక వాల్ పోస్టర్లను ఆమె విడుదల చేశారు. ఈ కార్యక్ర మంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎఆర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల తొలి వారంలో పిఎం కిసాన్ నిధులు జమ

**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా కేంద్రం ఇస్తున్న ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకానికి సంబంధించిన ఆర్థిక సాయాన్ని నవంబరు మొదటి వారంలో విడుదల చేయనుంది. ఈ 21వ విడత పిఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో రూ.2000 జమ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. ప్రభుత్వం 4 నెలల వ్యవధిలో వాయిదా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. గత వాయిదాను పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం తదుపరి అంటే 21వ వాయిదాను దీపావళి సందర్భంగా పీఎం కిసాన్ నగదు ఖాతాల్లో జమ చేస్తారని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది. కాగా ఈ కిసాన్ యోజన పథకం కింద, ప్రతి సంవత్సరం రైతుల బ్యాంకు ఖాతాలో రూ.6 వేల ఆర్థిక సహాయం జమ చేస్తారు. సంవత్సరానికి 3 వాయిదాలలో కేంద్రం ఆ నగదును అందిస్తుంది. ఈ సంవత్సరం 20వ వాయిదాను ఆగస్టు 2వ తేదీన విడుదల చేశారు.



ఆటోలో ప్రయాణిస్తున్న కెటిఆర్, పక్కన కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

## ఉప ఎన్నికల్లో ప్రచార పోటీ

### ఆటో ఎక్కిన బిఆర్ఎస్.. బస్సెక్కిన కాంగ్రెస్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 28(జర్నలిస్ట్ ఫైల్) :** జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో ఎన్నికల ప్రచార పోటీ నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ కార్య నిర్వా హక అధ్యక్షుడు కేటీఆర్ ఆటో డ్రైవర్ల సమస్యపై సోమవారం ఆటో కార్మికులకు కాం గ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు ఆటో కార్మికులకు మద్దతుగా నిలిచారు. ఇందులో భాగంగా ఆటో డ్రైవర్లు ఎదు ర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో కేటీఆర్, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆటోలో ప్రయాణించారు. ఇంధన ధరల, భీమా, పర్మిట్ సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అలాగే సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఎర్రగడ్డ ప్రాంతంలో ఆటో డ్రైవర్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని ఆటోలో ప్రయాణించారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ ఆటో ప్రయాణానికి పోటీగా కాంగ్రెస్ పార్టీ మంత్రి పొన్నం ప్రభాకర్ బేగంపేట నుండి యూసుఫ్‌గూడ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత ప్రయాణంపై ఆయన మాట్లాడారు. పథకాలు కొనసాగాలంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.

# ధర మద్దతు కింద పంటల కొనుగోలుకు అనుమతి ఇవ్వాలి

### కేంద్రానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి



**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ధర మద్దతు పథకం కింద చేపట్టనున్న పంటల కొనుగోలుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు కేంద్రాన్ని కోరారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఢిల్లీ నుండి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఈ పథకంలో మొక్కజొన్న, జొన్న పంటలను కూడా చేర్చాలని సూచించారు. అలాగే తెలంగాణలో పెసర, మినుము పంటలు 100 శాతం, సోయాబీన్ పంటలను 50 శాతం వరకు కనీస మద్దతు ధర కింద కొనుగోలు అనుమతి ఇవ్వాలన్నారు.

**తేమ శాతం ఎక్కువున్నా కొనుగోలు చేయాలి**

తెలంగాణలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తేమ శాతం ఎక్కువ ఉన్నా పత్తిని మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు మరో ప్రకటనలో తెలిపారు. తమ ప్రభుత్వం పత్తి రైతులకు గరిష్ట మద్దతు ధర అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రం నుంచి అనుమతులు వచ్చే వరకు రైతులు పత్తిలో తేమ శాతంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు పత్తిని అమ్ముకునేందుకు మార్కెట్ యార్డులు, జిన్నింగ్ మిల్లుకు తీసుకువచ్చే ముందు తేమ 12 శాతం మించకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నిజామాబాద్‌లో నేరగాడి ఎన్‌కౌంటర్‌పై హెచ్‌ఆర్‌సిలో మరో ఫిర్యాదు

**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** నిజామాబాద్‌లో రియాజ్ అనే నేరగాడి ఎన్‌కౌంటర్‌పై రాష్ట్ర మానవ హక్కుల సంఘంలో మరో ఫిర్యాదు అందింది. ఈ నెల 20వ తేదీన నిజా మాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఘటన జరగడం తెలిసిందే. అంతకు మూడు రోజుల ముందు రియాజ్ సిసిఎస్ కానిస్టేబుల్ ప్రమోద్‌ను కత్తితో పొడిచి చంపడం విదితమే. దీని తరువాత మరో ముగ్గురిపైనా రియాజ్ కత్తితో దాడిచేయగా వారు తీవ్రంగా గాయపడ్డారు. వారంతా ప్రస్తుతం ఆసుపత్రుల్లో కోలుకుంటున్నారు. ఈ సందర్భంగా జరిగిన పెనుగులాటలో రియాజ్‌కు కూడా గాయాల య్యాయి. ఈ గాయాలకు చికిత్స చేయించేందుకు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా ఎదురు తిరిగి, కానిస్టేబుల్ వద్ద వున్న తుపాకిని లాక్కుని కాల్పులకు యత్నించాడు. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో రియాజ్ హతమయ్యాడు. దీనిపై ఇది వరకే నిజామాబాద్ జిల్లా హక్కుల సంఘం తరపున రాష్ట్ర మానవ హక్కుల సంఘంలో ఫిర్యాదు నమోదు కాగా తాజాగా సోమవారం నాడు రియాజ్ కుటుంబీకుల తరపున ఇంకో ఫి ర్యాదు వచ్చింది. రియాజ్ తల్లి, భార్య తరపున ఈ ఫిర్యాదు అందింది. కాగా ఈ ఫిర్యాదుపై స్పందించిన మానవ హక్కుల సంఘం దీనిపై డిజిపి నుంచి వివరణ కోరింది. నవంబర్ మూడవ తేదీ లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.




ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరామ్‌కు ఫిర్యాదు చేస్తున్న అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, గణేష్ తదితరులు.

## బిఆర్ఎస్ నేతలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు, కేసులు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేయడంలో పోటీపడుతున్నాయి. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ర్యాలీని కాంగ్రెస్ శ్రేణులు అడ్డగించాయి. ఈ నేపథ్యంలోనే విషయాన్ని పోలీసుల, ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు గంటన్నర తరువాత ర్యాలీ ముందుకు కదిలింది. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న కాంగ్రెస్ ప్రచార రథాన్ని కాలుస్తానంటూ అర్థంవచ్చేలా పెద్ది సుదర్శన్‌రెడ్డి సైగలు చేశారని కాం గ్రెస్ శ్రేణులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు పెద్ది సుదర్శన్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు బీఆర్ఎస్ శ్రేణులు బహిరంగంగా అనుమతులు లేకుండా ప్రచారం నిర్వహిస్తున్నాయంటూ ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యే గణేష్, అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డిలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయిరామ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆధారాలను అందించారు. మరోవైపు అధికారిక హోదాలో ఉన్న తెలంగాణ ప్రభుత్వ మీడియా డైరెక్టర్ కర్రి శ్రీరాం ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు బీఆర్ఎస్ నేతలు చిరుమల్ల రాకేష్, వాఊదేవరెడ్డి, సైదిరెడ్డి రిటర్నింగ్ అధికారి సాయిరామ్‌కు ఫిర్యాదు చేశారు.

## విద్య, పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిరంతరం గమనించాలి

### కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ టౌన్, జర్నలిస్ట్ ఫైల్ :** నాణ్యమైన విద్య, పోషకాహారం అందించడమే కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రజలకు పోషకాహారం ప్రాధాన్యతపై మరింత అవ గాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కళాభారతిలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం ముగింపు వేడుకలు నిర్వహించగా బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఆరోగ్యంగా ఉండి పిల్లలు పోషకాహార లోపం బారిన పడకుండా చూసుకోవాలన్నారు. అందుకు తగ్గట్లు తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవాల న్నారు. బాల్యంలో పోషకాహార లోపం అధిగమిస్తే చిన్నారులు శారీరకంగా మానసికంగా దృఢంగా మారుతారని పేర్కొన్నారు. ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే కేంద్రం 21 వేల కోట్లు చిన్నారుల సంక్షేమానికి కేటాయించినట్లు వివరించారు. జిల్లాలో 52,000 మంది లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. చిన్నారుల సంక్షేమం, విద్య, వైద్యానికి జిల్లా కలెక్టర్ అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ప్రశంసించారు. నివేదికల ప్రకారం సంబంధిత శాఖ అధికారుల పనితీరుతో రాష్ట్రంలోనే మన జిల్లా ముందువరుసలో ఉందన్నారు. అవగాహన లేకనే అనారోగ్య సమస్యలు వస్తాయని, ప్రతి ఒక్కరూ పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ రోజు ఏదో ఒక టాబ్లెట్ వేసుకుంటున్నారని, ఇది తగ్గాలని ఆకాంక్షించారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నిధులు అందిస్తానని ప్రకటించారు. పోషణ మాసోత్సవంలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరిం చారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శ్రీనివాస్, డిఎంహెచ్ఓ వెంకట రమణ, సిడిపివోలు,




## హాస్టళ్ల నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు28(జర్నలిస్ట్ ఫైల్) :** పేద విద్యార్థులు చదువుకునే హాస్టళ్ల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్య క్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూము లను అమ్మటాన్ని నిరసిస్తూ జాతీయ బిసి యువజన సంఘం అధ్యక్షుడు జి.అంజి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ ఆధ్వర్యం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో వేలాదిమంది విద్యార్థులతో కలసి భారీ ధర్నా, ర్యాలీ నిర్వ హించారు. ఈ ధర్నాను ద్దేసించి ఆర్.కృష్ణయ్య మాట్లా డుతూ ప్రభుత్వ భూ ములంటే ప్రజల ఆస్తు లని, వాటిని పేదల ఇళ్లకు, ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాల నిర్మాణాలకు వినియోగించాలి తప్ప ప్రభుత్వం అమ్మటం సరికాదని హితవు పలికారు. రాష్ట్రంలో మూడు వందలకుపైగా ప్రభుత్వ హాస్టళ్లు ఉంటే ఒక్కటి కూడా సొంత భవనంలో లేదని, ప్రభుత్వానికి పేద విద్యార్థుల సంక్షేమంపై, విద్యార్థుల భవిష్యత్తుపై ఆలోచనే లేదని మండిపడ్డారు.

బిసి విద్యార్థుల కోసం 150 కాలేజీ హాస్టళ్లు, 240 రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేయాలని కోరారు. కార్య క్రమంలో బిసి యువజన సంఘం నాయకులు అనంత య్య, రాజేందర్, మోడీ రాందేవ్, కౌశిక్, శివ, నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల పట్ల ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

## మాదకద్రవ్య వ్యసనం నుండి పుస్తక పఠనంలోకి మార్చాలి

### యువతకు మంత్రి జూపల్లి కృష్ణారావు హితవు



కథాసంపుటిని ఆవిష్కరించిన మంత్రి కృష్ణారావు, నరసింహారెడ్డి, బాలాచారి, వెంకటదాసు, రాఘవరెడ్డి తదితరులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), అక్టోబరు 28(జర్నలిస్ట్ ఫైల్) :** కవులు, రచయితలు, సాహితీవేత్తలు యువతను మాదకద్రవ్య వ్యసనం నుండి పుస్తకపఠనం వ్యసనం లోకి తీసుకువస్తేనే సమాజంలో సరైన మార్పు, చైతన్యం కలుగుతుందని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పెద్దూరి వెంకటదాసు రచించిన ప్రేమ చిగురించిన శుభవేళ కథా సంపుటికి అందుకు దోహదపడుతుందని భావిస్తున్నారు. సమాజాన్ని మార్చేందుకు మరిన్ని గొప్పగొప్ప రచనలు చేయాలని వెంకటదాసుకు సూచించారు. అలాంటి రచనలను మీకు ఒక్కరూపాయి కూడా ఖర్చు కాకుండా అచ్చువేయించే బాధ్యత తనదని వాగ్దానం చేశారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ, జి.వి.ఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి లయన్ వి.వి.రాఘవరెడ్డి నేతృత్వంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు విశిష్ట అతిథులు డా. ఏనుగు నరసింహారెడ్డి, బైస దేవదాసు, పొత్తూరి సుబ్బారావు, మదన్‌మోహన్, పొత్తూరి విజయలక్ష్మి, వంశీరామరాజు, రాఘవరెడ్డి, ప్రముఖ వైద్యుడు డా. శ్రీనివాస్ కాశ, డా. పోరెడ్డి రంగయ్య తదితరులతో కలిసి పెద్దూరి వెంకటదాసు రచించిన ప్రేమ చిగురించిన శుభవేళ కథాసంపుటిని ఆవిష్కరించి శుభాభినందనలు తెలిపారు.

## బిఎస్‌సి(ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల రేపు తుదిగడువు

### ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి: బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి సైదులు

**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డిగ్రీ కాలేజీలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం(పిజెటిఏయు) అనుబంధ కాలేజీలో బిఎస్‌సి (హానర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ రేపటి(బుధవారం)తో ముగియనుంది. ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించామని.. బుధవారం(అక్టోబరు 29)తో గడువు ముగుస్తుందని బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగుల సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులో ప్రవేశం కోసం ఇంటర్‌మీడియట్ (బైపీసీ గ్రూప్) దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణతతో పాటు, తెలంగాణ స్టేట్ టీజీ ఈఏపీసెట్-2025 పరీక్షలో అర్హత సాధించిన వెనుకబడిన తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సొసైటీ సెక్రటరీ సూచించారు. ఈ కోర్సులో చేరడానికి దరఖాస్తు చేసుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ 1,50,000.. పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 2,00,000 మించకూడదని సూచించారు. ఈనెల 21 నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు ఆఫీస్ పని దినాల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 040-23328266 నంబరులో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

## మహిళల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

### మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు

**హైదరాబాద్, అక్టోబరు28(జర్నలిస్ట్ ఫైల్) :** మహిళల ఆర్థిక అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారవు అన్నారు. సోమవారం నాంపల్లి నుండి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆర్టీసీ బస్సులలో మహిళలతో ప్రయాణించారు. మహాలక్ష్మి స్కీం ద్వారా ప్రజలు ఏ విధంగా లబ్ధి పొందుతున్నారనే విషయం అమె అడిగి తెలుసుకొన్నారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయని రేవంత్‌రెడ్డి పాలనలో సుభిక్షంగా ఉన్నామని వారు సంతోషం వ్యక్తం చేశారని ఆమె వివరించారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్కడికి వెళ్లాలన్న ఫ్రీగా వెళ్తున్నామని ఆఫీస్‌కు వెళ్లాలన్న కాలేజీకి వెళ్లాలన్న గుడికి వెళ్లాలన్న బంధువుల ఇంటికి వెళ్లాలన్న బస్సులో ఉచితంగా వెళుతున్నామని తనకు తెలిపారని ఆమె అన్నారు. మాకు ఈ పథకం ద్వారా చాలా డబ్బులు ఆదా అవుతున్నాయని వారు ఆనందం వ్యక్తం చేశారని అన్నారు.

## రైతు ఉత్పత్తి సంఘాలుగా సహకార సంఘాలు

### రాష్ట్రంలో 311 పిఎసిఎస్‌ల అప్‌గ్రేడ్

**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) రైతు ఉత్పత్తి సంఘాలుగా (ఎఫ్‌పిఎస్) మారనున్నాయి. దీనికి సంబంధించి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ సహకార సంఘాలను దశలవారీగా రైతు ఉత్పత్తి సంఘాలుగా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా 908 ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలు ఉండగా, మొదటి విడతలో 311 సంఘాలను అప్‌గ్రేడ్ చేసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చుతున్నారు. ఒక్కో సంఘంలో దాదాపు 300 మందికి రైతులు సభ్యులుగా చేరి వాటా ధనం చెల్లించి కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి.

# మహిళలను గౌరవించే సంప్రదాయం లేని బిఆర్ఎస్

### మహిళా కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి

**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** బిఆర్ఎస్ పార్టీ వాళ్లకు మహిళలకు గౌరవం ఇచ్చే సంప్రదాయం లేదని మహిళ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికలు అనేవి బిఆర్ఎస్ పార్టీకి ఫైనల్ పరీక్షలు లాంటివనీ ఆమె అభివర్ణించారు. బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి రోజు రోజుకి దిగజారి పోతోందని ఆమె అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ లో చావు దెబ్బ తగిలిందని అన్నారు. మాగంటి గోపిచంద్ చనిపోయిన బాధ లో సునీత ఉంటే గృహిణిని ఎన్నికల బరిలో దించి తన స్వార్థ రాజకీయాల కోసం 'సానుభూతి'ని బిఆర్ఎస్ పార్టీ వాడుకుంటోంది. పిజెఆర్ చనిపోయాక ఆయన కుటుంబ సభ్యులు గతంలో కెసిఆర్ అపోయింట్మెంట్ కోసం గంటల తరబడి ఎదురుచూపులు తప్పలేదని పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేలు చనిపోతే ఏకపక్షంగా ఎన్నికలు జరిగేవి, ఐతే బిఆర్ఎస్ పార్టీ పిజెఆర్ చనిపోయాక ఎన్నికలు తీసుకొని వచ్చిన నీచమైన పార్టీ మీదని ఆమె నిందించారు.




బిఆర్ఎస్ 10 ఏళ్ళు పాలన లో తెలంగాణ ప్రజలు చూశారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చారని అన్నారు. తెలంగాణ భూమి పుత్రుడు బిసి బిడ్డకు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసేందుకు అవకాశం కల్పించిందని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత అన్నారు. రాష్ట్రం మొత్తం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వైపు చూస్తున్నారని ఆమె తెలిపారు. 22 కేసులు ,పిడి యాక్ట్ ఉన్న సల్మాన్ ఖాన్ ను బిఆర్ఎస్ పార్టీ లోకి ఎలా తీసుకున్నారని ఆమె ప్రశ్నించారు.

తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ ఉనికి ఎక్కడ ఉందని ఆమె ప్రశ్నించారు. నాలుగు ముక్కలాట గా బిఆర్ఎస్ పార్టీ ఉందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం బిఆర్ఎస్ రాష్ట్రం ను ఎలా దోచుకున్నారో కవిత పూసగొచ్చినట్లుగా వివరించిందని ఆమె తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ వల్ల మాగంటి సునీత పరువుపోయిందని ఆవేదన చెందారు. రాజకీయాలతో మాగంటి సునీతకు సంబంధం లేదని, బలవంతంగా జూబ్లీహిల్స్ అభ్యర్థి గా బరిలోకి దించారని అన్నారు.

# బంగ్లా మ్యాప్‌లో భారత్ భూభాగాలు!

## వివాదాస్పద మ్యాప్‌ను పాక్ ఆర్మీచీఫ్‌కు అందించిన యూనస్



**ఢాకా, అక్టోబరు 28 :** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహమ్మద్ యూనస్ మరోసారి భారత్‌తో దౌత్యపరమైన ఉద్రిక్తతలకు కారణమయ్యారు. భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్‌లో అంతర్భాగంగా చూపిస్తున్న ఒక వివాదాస్పద మ్యాప్‌ను పాకిస్థాన్ ఆర్మీ ఉన్నతాధికారికి ఆయన బహుమతిగా ఇవ్వడం తీవ్ర దుమారం రేపుతోంది. ఈ చర్య ద్వారా భారత్ సార్వభౌమత్వాన్ని యూనస్ పరోక్షంగా ప్రశ్నించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పాకిస్థాన్ జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చైర్మన్ జనరల్ సాహిర్ షంషాద్ మీర్జా ఢాకాలో పర్యటించారు. యూనస్‌తో భేటీ తర్వాత, యూనస్ స్వయంగా తన ట్విట్టర్ ఖాతాలో కొన్ని ఫొటోలను పోస్ట్ చేశారు. వాటిలో, పాక్ జనరల్‌కు ఆర్ట్ ఆఫ్ ట్రయంఫ్ అనే పుస్తకాన్ని బహుమతిగా ఇస్తున్న చిత్రం ఉంది. అయితే, ఆ పుస్తకం ముఖచిత్రంపై ఉన్న మ్యాప్‌లో భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలను బంగ్లాదేశ్ భూభాగంలో కలిపి చూపించారు. ఇది తీవ్రవాద ఇస్లామిక్ సంస్థలు కోరుతున్న గ్రేటర్ బంగ్లాదేశ్ వాదనకు బలం చేకూర్చేలా ఉంది. ఈ ఫొటో బయటకు రావడంతో సోషల్ మీడియాలో యూనస్‌పై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అనవసరంగా భారత్ అంతర్గత విషయాల్లోకి ప్రవేశిస్తున్నారని నెటిజన్లు విమర్శిస్తున్నారు. అయితే ఈ వివాదంపై భారత విదేశాంగ శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. 1971 విమోచన యుద్ధం తర్వాత చారిత్రాత్మకంగా దెబ్బతిన్న బంగ్లాదేశ్‌పాకిస్థాన్ సంబంధాలు, యూనస్ అధికారంలోకి వచ్చాక మెరుగు పడుతున్నాయనడానికి ఈ భేటీ నిదర్శనంగా నిలుస్తోంది. యూనస్ భారత్ ఈశాన్య రాష్ట్రాల గురించి మాట్లాడటం ఇది మొదటిసారి కాదు. గత ఏప్రిల్‌లో చైనా పర్యటనకు వెళ్లినప్పుడు, "భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలు భూపరివేష్టిత ప్రాంతాలు. సముద్రానికి చేరుకోవడానికి వాటికి మార్గం లేదు. ఆ ప్రాంతానికి సముద్ర సంరక్షకులం మేమే అని వ్యాఖ్యానించి ఢిల్లీకి ఆగ్రహం తెప్పించారు. చైనా తన ఆర్థిక కార్యకలాపాలను ఈ ప్రాంతంలో విస్తరించుకోవడానికి ఇది మంచి అవకాశమని ఆయన సూచించారు. యూనస్ వ్యాఖ్యల తర్వాత భారత్ తీవ్రంగా స్పందించింది. బంగ్లాదేశ్ వస్తువులు భారత భూభాగం గుండా నేపాల్, భూటాన్‌లకు వెళ్లేందుకు వీలు కల్పించే రవాణా ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. దీనికితోడు, యూనస్ సన్నిహితులు కూడా గతంలో గ్రేటర్ బంగ్లాదేశ్ మ్యాప్‌లను సోషల్ మీడియాలో షేర్ చేయడం, భారత్‌పైరెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం వంటివి చేశారు. వరుస ఘటనలపై యూనస్ మౌనంగా ఉండటం, ఇప్పుడు స్వయంగా వివాదాస్పద మ్యాప్‌ను బహుమతిగా ఇవ్వడం చూస్తుంటే.. చైనా, పాకిస్థాన్‌ల మద్దతుతో ఈ ప్రాంతంలో రాజకీయ సమీకరణాలను మార్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని అంతర్జాతీయ సంబంధాల నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# వాణిజ్య ఒప్పందం దిశగా భారత్ - అమెరికా చర్చలు



- ఆసియాన్ సదస్సు వేదికగా సమాలోచనలు
- మార్కో రూబియోతో జైశంకర్ సమావేశం
- అటు యూఎస్‌లో జీన్ షాహీన్‌తో భారత్ రాయబారి భేటీ
- వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడి

**కౌలాలంపూర్, అక్టోబరు 28 :** భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే దిశగా చర్చలు కొనసాగుతున్నాయి. భారత్ వస్తువులపై అమెరికా విధించిన శిక్షాత్మక సుంకాల కారణంగా దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించడానికి రెండు వైపులా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న ఆసియాన్ శిఖరాగ్ర సదస్సు వేదికగా భారత్ విదేశాంగ మంత్రి, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కీలక చర్చలు జరిపారు. మలేసియా వేదికగా ఆసియాన్ శిఖరాగ్ర సమావేశాలు జరుగు తున్నాయి. ఈ సమావేశాలకు ప్రధాని మోడీ గైర్హాజరయ్యారు.

మోడీ తరపున భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మలేసియాకు వెళ్లారు. ఈ సందర్భంగా అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోను జైశంకర్ కలిశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు, ద్వైపాక్షిక సంబంధాలు, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులపై జైశంకర్- రూబియో చర్చించారు. ఈ మేరకు జై శంకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు."ఈ ఉదయం కౌలాలంపూర్‌లో రూబియోని కల వడం ఆనందంగా ఉంది. ద్వైపాక్షిక సంబం ధాలతోపాటు ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై చర్చలు జరిగాయి" అని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య కీలక చర్చలు జరిగినట్లుగా పేర్కొన్నారు. ఇంబంధించిన ఫొటోలను కూడా పంచుకున్నారు. ఆదివారం జైశంకర్ మలేసియా ప్రధానమంతరతి అన్వర్ ఇబ్రహీం, సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్, థాయ్‌లాండ్ విదేశాంగ మంత్రి సిహాసక్ ఫువాంగ్కెట్కియోలతో విడివిడిగా చర్చలు జరిపారు. ఇదిలా ఉంటే అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ ర్యాంకింగ్ సభ్యురాలు జీన్ షాహీన్ సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా పరస్పరం ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందం, ఇంధన భద్రత, చమురు, గ్యాస్ వాణిజ్యం గురించి చర్చించారు. ఇరు దేశాలకు సంబంధించిన కీలక చర్చలు జరిగినట్లుగా వినయ్ మోహన్ క్వానరాతా ఎక్స్‌లో తెలిపారు. ఈ సందర్భంగా రష్యా- ఉక్రెయిన్ వివాదంపై భారత ప్రధాని మోడీ వైఖరిని రాయబారి క్వాత్రా స్పష్టంగా తెలియజేశారు.

మరోవైపు వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు బాగా పురోగమిస్తున్నాయని, రెండు వైపులా చాలా అంశాలపై కమ్యూనికేట్ అవుతున్నాయని, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందం ఆసన్నమైందని సూచించారు.

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మనం చాలా దగ్గరగా ఉన్నట్లు భావిస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య చర్చలు సుదీర్ఘంగా సాగుతున్నాయి. భారత్- అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశ కోసం ఇప్పటి వరకు ఐదు రౌండ్ల చర్చలు పూర్తయ్యాయి. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం ముగింపునకు చాలా దగ్గరగా ఉంది. భారత్‌పై తొలుత 25శాతం సుంకాన్ని ట్రంప్ వేశారు. అనంతరం రష్యాతో సంబంధాలు పెట్టుకున్నందుకు జరిమానాగా మరో 25శాతం సుంకం విధించారు.

ఇలా మొత్తంగా భారత్‌పై 50శాతం సుంకం పడింది. అయితే రష్యాతో సంబంధాలు తెంచుకుంటే సుంకాలు తగ్గిస్తామని అమెరికా అంటోంది.

ప్రస్తుతం రష్యా దగ్గర చమురు కొనుగోలు తగ్గించేందుకు భారత్ ప్రయత్నిస్తోంది.

# మీకుటుంబంలో ఒకడిగా చూడండి!

## మృతుల కుటుంబాలను క్షమించమని కోరిన టివికె చీఫ్ విజయ్



**మహాబలిపురం, అక్టోబరు 28 :** తమిళనాడు కరూర్‌లో టీవీకే చీఫ్, ప్రముఖ నటుడు విజయ్ నిర్వహించిన ప్రచార ర్యాలీలో చోటు చేసుకున్న తొక్కిసలాటలో మృతుల కుటుంబాలను కలిసారు. వీరికోసం పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రిసార్టును బుక్‌చేసారు. ప్రతి కుటుంబానికి ఒక సూట్ చొప్పున బుక్‌చేసినటివికె పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమం మొత్తం సజావుగా సాగేటట్లు పర్యవేక్షించారు. భద్రతా కారణాల రీత్యా ఎక్కువమందిని మీడియాప్రతినిధులను కూడా అనుమతించలేదు. మీ కుటుంబంలో ఒకడిగా చూడాలని, ఏంసమస్య వచ్చినా తాను అండగా ఉంటానని టివికె చీఫ్ విజయ్ ఈసందర్భంగా మృతుల కుటుంబాల్లో భరోసా నింపారు. జరిగిన సంఘటన విషాదాంతమని ఈఘోరంపై తన ప్రమేయం లేకున్నా అందరూ క్షమించాలని నటుడు విజయ్ వారిని కోరారని పార్టీ నేతలు వెల్లడించారు. మహాబలిపురం లోని ఓ రిసార్ట్‌లో బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. ప్రతికుటుంబాన్ని ఆయన ఆప్యాయంగా పలకరించారు. మృతులకు చెందిన 37 కుటుంబాలతో సహా 200 మందితో భేటీ అయ్యారు. ఈ మీటింగ్ కోసం టీవీకే దాదాపు 50 రూమ్స్‌ను బుక్ చేసింది. కరూర్‌తోపాటు ఇతర జిల్లాల్లో ఉన్న బాధిత కుటుంబాలను ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు తరలించారు. అక్కడ వారితో విజయ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రతీ కుటుంబం నుంచి నాలుగు నుండి ఐదుగురు వ్యక్తులు విజయ్‌ను కలవడానికి వచ్చారు. ప్రతి ఒక్కరినీ విజయ్ వ్యక్తిగతంగా పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇక ఈ భేటీకి మీడియా సహా ఇతరులను అనుమతించలేదు. 2026 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్త పార్టీని స్థాపించిన విజయం రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం మొదలుపెట్టారు. గత నెల 27న కరూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 60 మంది గాయపడ్డారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా విషాదాన్ని మిగిల్చింది. ఇక మృతుల కుటుంబాలకు టీవీకే ఆర్థిక సాయంగా రూ.20 లక్షలు అందజేసిన విషయం తెలిసిందే.

# పాక్- అఫ్ఘాన్ సమస్య పరిష్కరిస్తా మధ్యవర్తిత్వానికి సిద్ధం

## ఆసియాన్ సదస్సులో ట్రంప్



**కౌలాలంపూర్, అక్టోబరు 28 :** పాకిస్థాన్- అఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న వివాదాన్ని తానే పరిష్కరిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందుకొచ్చారు. మలేషియాలో జరిగిన ఆసియాన్ సదస్సులో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య మళ్లీ వివాదం మొదలైందని విన్నాను. కానీ నేను దాన్ని చాలా త్వరగా పరిష్కరిస్తాను. వాళ్లిద్దరూ నాకు తెలుసు. మధ్యవర్తిత్వం నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నా అని వ్యాఖ్యానించారు. వివాదాలను పరిష్కరించడం తనకు బాగా చేతనైన పని అని, దీని ద్వారా లక్షలాది ప్రాణాలను కాపాడగలనని ట్రంప్ చెప్పుకొచ్చారు. గతంలో భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడంలో తానే కీలకపాత్ర పోషించానని ట్రంప్ మళీ పాత పాటే పాడారు. ఇస్తాంబుల్ వేదికగా పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఆసియాన్ సదస్సులో ప్రసంగించిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జపాన్ బయలుదేరి వెళ్లారు. టోక్యోలో ట్రంప్‌కు ఘనస్వాగతం లభించింది. జపాన్ ప్రధానమంత్రి సనాయి తకాచితో సమావేశమై, ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరుపనున్నారు. అనంతరం జపాన్- అమెరికా సదస్సులో పాల్గొననున్నారు.

# షూవిసిరిన లాయర్‌పై ధిక్కార చర్యలకు సుప్రీం నో!



**న్యూఢిల్లీ, అక్టోబరు 28 :** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఇటీవల షూ విసిరేందుకు ప్రయత్నించిన లాయర్‌పై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టేందుకు అనుమతించేది లేదని సుప్రీంకోర్టు సోమవారం నాడు పేర్కొంది. ఈ విషయంపై సీజేఐ ఎలాంటి కేసు నమోదు చేయలేదని, లాయర్‌పై చర్యలు తీసుకోవడానికి సీజేఐ విముఖత చూపించారని తెలిపింది. లాయర్‌పై కోర్టు ధిక్కారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఇటీవల పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కోర్టు ధిక్కార నోటీసు జారీ చేయడం వల్ల సీజేఐపై షూ విసిరిన లాయర్‌కు అనవసర ప్రాధాన్యత ఇచ్చినట్టు అవుతుందని, ఈ ఘటన దానంతటదే సద్దుమణుగుతుందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయ పడింది. విష్ణుమూర్తి విగ్రహానికి సంబంధించిన ఒక కేసులో సీజేఐ వ్యాఖ్యలకు నిరసనగా రాకేష్ కిషోర్ అనే అడ్వకేట్ ఈనెల 6న ఆయనపై షూ విసిరేందుకు ప్రయత్నించారు. భద్రతా సిబ్బంది అతన్ని అడ్డుకుని బయటకు పంపారు. సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదంటూ రాకేష్ కిషోర్ నినాదాలు చేశారు. కోర్టులో నినాదాలు చేయడం, షూ విసిరడం కోర్టు ధిక్కారణ కిందకు వస్తుందని, అయితే దీనిపై చట్టం ప్రకారం ముందుకు వెళ్లడం అనేది సంబంధిత న్యాయమూర్తిపై ఆధారపడి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తామని కూడా తెలిపింది.

# దంకీరూటులో అమెరికాకువెళ్లి పట్టుబడిన భారతీయులు!



**కర్నాల్, అక్టోబరు 28 :** అమెరికాలో అడుగుపెట్టి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనుకున్న హర్యానా యువకుల కలలు కల్లలయ్యాయి. అక్రమంగా డంకీ మార్గంలో దేశంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన సుమారు 50 మంది యువకులను అమెరికా అధికారులు అరెస్ట్ చేసి, బేడీలతో భారత్‌కు తిప్పి పంపారు. 25 నుంచి 30 ఏళ్ల వయసున్న ఈ యువకులంతా హర్యానాలోని జింద్, కైథల్ జిల్లాలకు చెందిన వారు. ఈ ఘటనలో బాధితుడైన కైథల్ జిల్లాకు చెందిన నరేశ్ కుమార్ అనే యువకుడు తన ఆవేదనను మీడియా ముందు వెల్లడించాడు. వ్యవసాయ భూమిని అమ్మి ఓ ఏజెంట్‌కు రూ. 57 లక్షలు ఇచ్చాను. పనామా అడవుల గుండా అమెరికాకు పంపిస్తానని చెప్పాడు. కానీ, సరిహద్దు దాటుతున్నప్పుడు నన్ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. 14 నెలల తర్వాత బేడీలతో వెనక్కి పంపారని నరేశ్ వాపోయాడు. ఏజెంట్ తన నుంచి పలు దఫాలుగా డబ్బులు గుంజినట్లు తెలిపాడు. మొదట రూ. 42 లక్షలు తీసుకున్నాడు. గ్వాటెమాలలో రూ. 6 లక్షలు, మెక్సికోలో మరో రూ. 6 లక్షలు, సరిహద్దు దాటే ముందు మిగిలిన మొత్తాన్ని తీసుకున్నాడు. కానీ, నన్ను సురక్షితంగా అమెరికా చేర్చకుండా జైలు పాలు చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను మోసం చేసిన ఏజెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, యువత ఎవరూ డంకీ మార్గాన్ని ఎంచుకోవద్దని విజ్ఞప్తి చేశాడు. ఈ ఘటనపై కైథల్ ఎస్పీ ఉపాసన మాట్లాడుతూ, అమెరికా నుంచి బహిష్కరణకు గురైన యువకులను వారి కుటుంబాలకు అప్పగించినట్లు తెలిపారు. వారి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, వారిలో ఒకరికి నేరచరిత్ర ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. జింద్ జిల్లాకు చెందిన ముగ్గురు యువకులను కూడా ఇలాగే వెనక్కి పంపారని ఎస్పీ కుల్దీప్ సింగ్ వెల్లడించారు. డంకీ మార్గంలో విదేశాలకు వెళ్లడం తీవ్రమైన నేరం. ఇది మన సమాజ ప్రతిష్ఠను దెబ్బతీస్తుంది. ఇలాంటి అక్రమ ప్రయాణాలు ఆర్థిక నష్టాన్ని కలిగించడమే కాకుండా, ప్రాణాలకు కూడా ముప్పు తెచ్చిపెడతాయి. అనేక సందర్భాల్లో యువకులు శారీరక వేధింపులు, మోసాలు, చివరికి మరణాన్ని కూడా ఎదుర్కొంటున్నారని జింద్ ఎస్పీ కుల్దీప్ సింగ్ హెచ్చరించారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు చట్టబద్ధమైన మార్గాలను మాత్రమే ఎంచుకోవాలని ఆయన సూచించారు. యువతను తప్పుదోవ పట్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# డిజిటల్ అరెస్టు.. అత్యంత భయంకర ముప్పు

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆందోళన



**న్యూఢిల్లీ, అక్టోబరు 28 :** డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదరింపులకు గురిచేస్తూ.. భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి.. తాము పోలీసులమని బెదరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయ పెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

# షట్‌డౌన్‌తో 8 వేల విమానసర్వీసులకు ఎఫెక్ట్

## అమెరికాలో తీవ్రమవుతున్న రవాణా సమస్యలు



**వాషింగ్టన్, అక్టోబరు 28 :** అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి విమాన సర్వీసుల్లో అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ షట్‌డౌన్‌తో వేల సంఖ్యలో విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. ఈ షట్‌డౌన్‌తో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు హాజరుకావడం లేదు. ఇది విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది. పలు విమానాశ్రయాల్లో దాదాపు 8 వేలకుపైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. పలు విమానాలు రద్దైనట్లు తెలిసింది. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా చాలా చోట్ల ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది విధులకు హాజరుకావడంలేదు. ఫలితంగా అనేక ప్రాంతాల్లో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది కొరత ఏర్పడింది. లాస్‌ఏంజిల్స్, కాలిఫోర్నియా, చికాగో, వాషింగ్టన్, న్యూజెర్సీలోని నెవార్క్ తదితర ప్రాంతాల్లో సిబ్బంది కొరత ఉన్నట్లు ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) తెలిపింది. ఫలితంగా దాదాపు 8వేలకు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నట్లు వెల్లడించింది. మరోవైపు రానున్న రోజుల్లో సిబ్బంది కొరత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అమెరికా రవాణా మంత్రి శాన్ డఫీ వెల్లడించారు. దీంతో విమానాల ఆలస్యం, సర్వీసుల రద్దు మరింత ఎక్కువగా ఉండొచ్చని పేర్కొన్నారు. విమానాల ఆలస్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఉద్యోగి కాకుండానే అధికారి భార్యకు రెండేళ్లుగా జీతం

## రాజస్థాన్‌లో వెలుగులోకి వచ్చిన ఐటిడైరెక్టర్ నిర్వాకం



**జైపూర్, అక్టోబరు 28 :** ఆమె అసలు సాఫ్ట్ వేర్ ఉద్యోగియే కాదు. అయినా రెండు టెక్ కంపెనీల్లో జాబ్. ఒక్క రోజు కూడా ఆఫీస్‌కు వెళ్లలేదు. అయినా ప్రతినెల ఠంచనుగా ఆమె అకౌంట్లలో జీతం పడించింది. ఇలా ఇంట్లో కూర్చునే రెండేండ్లలో ఏకంగా రూ.37 లక్షల 54 వేలు సంపాదించింది. ఇంజినీరింగ్, డిగ్రీ పట్టాలు ఉన్నా ఉద్యోగం ఎలా సంపాదించాలని చాలామంది నెలల తరబడి కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉంటారు.. అయినా ఆమె రెండు ఉద్యోగాలు ఎలా సంపాదించారనుకుంటున్నారా అంటే ఆమె భర్త రాజస్థాన్ ప్రభుత్వ ఐటీ శాఖలో డైరెక్టర్ కావడమే. ప్రద్యుమ్న దీక్షిత్ అనే వ్యక్తి రాజస్థాన్ ప్రభుత్వ రాజ్‌కాంప్ ఇన్ఫో సర్వీసెస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఓరియన్‌ప్రో సొల్యూషన్స్, ట్రీజెన్ సాఫ్ట్‌వేర్ లిమిటెడ్ సంస్థలకు ప్రభుత్వ టెండర్లు దక్కేలా దీక్షిత్ చేశాడు. ప్రతిగా తన భార్య పూనమ్ దీక్షిత్‌కు ఉద్యోగం ఇవ్వాలని రెండు కంపెనీలను డిమాండ్ చేశాడు. ప్రతి నెల జీతం చెల్లించాలని ప్రతిపాదించాడు. దీంతో ఓరియన్‌ప్రో కంపెనీలో ఉద్యోగిగా, ట్రీజెన్ సాఫ్ట్‌వేర్‌లో ఫ్రీలాన్సింగ్ చేస్తున్నట్లుగా నకిలీ పత్రాలు సృష్టించాడు. ప్రతి నెలా అతడే నకిలీ అటెండెన్స్ సమర్పించేవాడు. ఇలా 2019 జనవరి నుంచి 2020 సెప్టెంబర్ వరకు పూనమ్ దీక్షిత్‌కు చెందిన వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లలో జీతం రూపంలో రూ.37,54,405 జమ అయ్యాయి. ఇలా పెద్దమొత్తంలో లంచంగా సంపాదించాడు. ఈ తంతంగంపై రాజస్థాన్ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. దీంతో న్యాయస్థానం ఏసీబీ విచారణకు ఆదేశించింది. అధికారుల దర్యాప్తులో భాగంగా ప్రద్యుమ్న దీక్షిత్ నకిలీ ఉద్యోగం వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

## సంక్షిప్తంగా..

### బాలీవుడ్ యువ నటుడు సచిన్ ఆత్మహత్య



**ముంబై, అక్టోబరు 28 :** బాలీవుడ్‌లో విషాదం నెలకొంది. యువ నటుడు సచిన్ చాంద్‌వడే (25) ఆత్మహత్య చేసుకున్నారన్న వార్త అందరినీ షాక్‌కు గురి చేస్తోంది. ఈ ఘటన కొన్ని రోజుల క్రితం జరగ్గా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలో ఉందిర్‌ఖేడ్‌లోని తన ఇంట్లో ఈ నెల 23న ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆయనను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో.. మరుసటిరోజు ఇంకో ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకున్నా ఫలితం దక్కలేదు. చికిత్స పొందుతూనే సచిన్ ఈ నెల 24న మృతి చెందినట్లు సమాచారం. ఆత్మహత్యకు గల కారణం తెలియాల్సి ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయిన సచిన్.. నటన పై ఆసక్తితో చిత్ర పరిశ్రమలోకి వచ్చారు. 'జాంతాఢా 2' వెబ్‌సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు.

### బ్రిటన్‌లో మరో సిక్కు యువతిపై లైంగిక దాడి

**లండన్, అక్టోబరు 28 :** బ్రిటన్‌లో భారతీయ మూలాలున్న మహిళలపై జాత్యహంకార ప్రేరేపిత లైంగిక దాడులు పెరుగుతున్నాయి. గత నెలలో సిక్కు మహిళపై జరిగిన దారుణ ఘటన మరవక ముందే తాజాగా మరో 20 ఏళ్ల భారతీయ యువతిపై అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. పశ్చిమ మిడ్‌లాండ్‌లోని వాల్సల్ ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకోగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని పట్టుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టారు. యూకే కాలమానం ప్రకారం శనివారం రోజు సాయంత్రం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన జరిగిన రోజే వాల్సల్ ప్రాంతంలో ఒక యువతిపై లైంగిక దాడి జరిగినట్లు వెస్ట్ మిడ్‌లాండ్స్ పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆపై దర్యాప్తు చేపట్టారు.

### మరణశిక్ష విధించినా సమ్మతమే :దర్శన్ తరపు న్యాయవాది



**బెంగళూరు, అక్టోబరు 28 :** చిత్రదుర్గకు చెందిన రేణుకాచార్య హత్య కేసులో నిందితుడు దర్శన్‌పై ఉన్న ఆరోపణలపై విచారణ పూర్తి చేసి, మరణశిక్ష విధించినా సమ్మతమేనని ఆయన తరఫు న్యాయవాది సునీల్ ఉన్నత న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. కారాగారంలో ఖైదీలకు ఇవ్వవలసిన కనీస సదుపాయాలను దర్శన్‌కు కల్పించలేదని వాదనలు వినిపించారు. దీనికి సంబంధించి 20 సార్లు బెయిలుకు అర్జీ వేసుకున్నా పరిగణనలోకి తీసుకోలేదని, కనీస సదుపాయాలు కల్పించాలని కోరినా పట్టించుకోలేదని తెలిపారు. విచారణ త్వరగా పూర్తి చేస్తే దానికి అనుగుణంగా శిక్షను అనుభవించేందుకు దర్శన్ సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. వెన్నునొప్పి సమస్య తిరగబెట్టిందని, తనకు సైనేడ్ ఇస్తే తిని ఆత్మహత్య చేసుకుంటానని దర్శన్ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. న్యాయస్థానం తీర్పును రిజర్వు చేసింది.

### ఢిల్లీలో పెరుగుతున్న వాయుకాలుష్యం



**న్యూఢిల్లీ, అక్టోబరు 28:** దేశ రాజధాని ఢిల్లీలో వాయుకాలుష్యం రోజు రోజుకు పెరుగుతోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ, ఎన్‌సిఆర్ ప్రాంతం వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణేశ్‌పూర్ వద్ద 318, జిటిబి నగర్‌లో 302, కశ్మీర్‌గేట్ ఐఎస్‌బిటి ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఏక్యూఐ నమోదైంది.

### తోబుట్టువుల అశ్లీల చిత్రాలతో బెదరింపులు: యువకుడి ఆత్మహత్య

**హర్యానా, అక్టోబరు 28:** సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు ఓ యువకుడు బలయ్యాడు. తన తోబుట్టువులకు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు పంపించి డబ్బులు డిమాండ్ చేయడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హర్యానాలోని ఫరీదాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫరిదాబాద్‌కు చెందిన రాహుల్ భారతి (19) అనే యువకుడికి రెండు వారాల క్రితం సైబర్ నేరగాళ్లు పలు చిత్రాలు పంపారు.

అందులో అతడి ముగ్గురు తోబుట్టువుల చిత్రాలు మార్ఫింగ్ చేసి ఉండడాన్ని చూసి షాక్‌కు గురయ్యాడు. నాటి నుంచి సైబర్ నేరగాళ్లు అతడికి పలుమార్లు కాల్ చేసి రూ.లక్షల్లో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తామని బెదిరించారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

## అమ్మవారి ఆభరణాలు మాయం చేసిన పూజారి అరెస్ట్



- 20,లక్షల విలువైన 190గ్రాముల బంగారం స్వాధీనం
- రూరల్ సి ఐ. ఉమేష్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** వదాన్యులైన భక్తులు అమ్మవారికి సమర్పించిన బంగారు ఆభరణాల స్థానంలో నకిలీ ఆభరణాలు అమర్చి, 20లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలను మాయం చేసిన పూజారిని ఎంతో చాకచక్యంగా అదుపులోకి తీస్తున్న ఉదతం, తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది.

తెనాలి నియోజక వర్గ పరిదిలోని, కొల్లిపర మండలం హనుమాన్ పాలెం గ్రామంలోని, కాశీ అన్నపూర్ణాసమేత శ్రీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో, చోటు చేసుకున్న, చోరీ ఉదంతాన్ని , నిందితుడిని పట్టుకున్న విధానం, మంగళవారం రూరల్ సి ఐ ఉమేష్ మీడియాకు వివరించారు. గతరెండున్నర సంవత్సరాలుగా ఆలయపూజారిగా విధులు నిర్వహిస్తున్న, పన్నాల దుర్గ జయరామ్ శర్మ,ఆలయ సమీపంలోనె నివాసముంటున్నాడని, విలాసవంతమైన జీవనం గడిపేందుకోసం, ఏదోవిధంగా డబ్బు సంపాదించాలన్న, దురుద్దేశానికి, పెరిగిన బంగారం ధరలు మరింత ఊతమివ్వడంతొ, ఏకంగా ఆలయంలోని అమ్మవారి బంగారు నగలపై, దృష్టిపడింది. బంగారు ఆభరణాల స్థానంలొ, అనుమానం రాకుండా గిల్టు నగలు తయారు చేయించి, బంగారు ఆభరణాలు చోరీ చేసిన పూజారి, రెండునెలలుగా పూజా విధులకు రాక పోవడం,అమ్మవారి నగలు నకిలీవని గుర్తించిన ధర్మకర్త, గ్రామ పెద్దలతొ కలిసి, కొల్లిపర పోలీస్ స్టేషన్ లొ, పిర్యాదు చేశారు. సి ఐ, ఉమేష్ చంద్ర ఆధ్వర్యంలొ చేపట్టిన దర్యాప్తులొ, నిందితుడి, బంగారు నగలను స్వాధినం చేసుకున్నట్లు సి ఐ ఉమేష్ తెలిపారు. 20,లక్షల విలువ చేసె,190గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.డిఎస్పీ బి. జనార్ధనరావు పర్యవేక్షణలొ, రూరల్ సి ఐ, ఉమేష్, కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు, సిబ్బంది, ఎంతొ చాకచక్యంగా కేసు ఛేదించిన క్రమంలొ, జిల్లా ఎస్పీవకుల్ జిందాల్ రివార్డులు ప్రకటించారు.

## పట్టణంలో పది పునరావాస కేంద్రాలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):**మోంథా తుఫాన్ తీరం దాటె సమయంలొ, ఏర్పడే ఉధృతి ప్రభావం గుంటూరు జిల్లా పై కూడా ఉంటుందన్న, వాతావరణ శాఖ హెచ్చరికల నేపధ్యంలొ, తెనాలి పట్టణంలోని, లోతట్టు ప్రాంతాల వారి, రక్షణ కోసం, ప్రత్యేకంగా 10,షెల్టర్లు ఏర్పాటు చేశారు.మంగళవారం లోతట్టు కాలనీ వాసుల రక్షణ కోసం, వారినిసురక్షిత ప్రాంతాలకు చేర్చేకార్యాచరణలొ, మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయినరాధిక, కమీషనర్ అప్పలనాయుడు , తమ సిబ్బందితొ పూలె కాలని వాసులను సురక్షితంగా ఉండేందుకు ఏర్పాటు చెసిన షెల్టర్ కు తరలించే ఏర్పాట్లు పరిశీలించారు.పూలె కాలనీ సమీపంలోని ఎస్టీబి ప్లాంట్, భవనాలొ షెల్టర్ ఏర్పాటు చేశారు. కల్పించిన ఏర్పాట్లను వివరించారు. తుఫాను తీరం దాటే సమయంలొ, ఉధృతిని దృష్టిలో ఉంచుకుని, చేసిన ఏర్పాట్లను వినియోగించుకోవాలని, కాలనీ వాసులకు బోజన వసతి, త్రాగు నీరు, సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అదేవిధంగా, చైతన్యకళాశాల, ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణాల్లొ, రక్షణ షెల్టర్లను ఏర్పాటు చేశారు.ఈసందర్బంగా కమీషనర్ జె. అప్పలనాయుడు మాట్లాడుతు నరేంద్ర దేవ్ కాలనీ, సీఎం కాలనీ, ఎడ్ల లింగయ్య కాలనీ, లంకదిబ్బ, బిసి కాలని, లోతట్టు ప్రాంతాల వారికోసం, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. భోజనవసతి, త్రాగునీరు ఏర్పాటు చేశామన్నారు. షెల్టర్లకు చేరుకునేందుకు బస్ సౌకర్యం ఉందన్నారు. బలంగా వీచే ఈదురుగాలులు, భారీవర్షం కారణంగా ప్రాణనష్టం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టమని, సచివాలయ కేంద్రాలలొ కాల్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు తమ వంతు జాగ్రత్తలు తీసుకుంటు సహకరించాలని కోరారు.

## అధైర్యపడొద్దు.. మేమున్నాం : ఎమ్మెల్యే నసీర్

- జోరువానలో ప్రజలకు తోడుగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- ఉదయం నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటన
- లోతట్టు ప్రాంతాల ప్రజలకు అభయం
- ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని భరోసా
- పునరావాస కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జోరువానలోనూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మంగళవారం ఉదయాన్నే వార్డుల పర్యటనకు వెళ్లారు. మొథాన్ తుపాను నేపథ్యంలో భయపడాల్సిన పని లేదని, 24/7 మీ వెంటనే ఉంటామని ప్రజలకు అభయం కలిగించారు. బొంగరాల బీడు, గడ్డిపాడు, బసవతారక రామ నగర్, మద్దిరాల కాలనీ, నెహ్రూ నగర్, రామిరెడ్డి తోట, వినోభా నగర్, ఇస్రాయెల్ పేట, జున్నుసైదా నగర్ ప్రాంతాలకు వెళ్లి స్థానిక ప్రజలతో మాట్లాడారు. సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అత్యవసరమైతే బయటికి రావాలని సూచించారు. కాలువలను పరిశీలించి ఎప్పటికప్పుడు షిల్టు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. వరద ప్రభావిత ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. చిన్న పిల్లలను బయటికి పంపించవద్దని సూచించారు. ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని చెప్పారు. మంచినీరు కాచి తాగాలని, చెట్ల కింద ఉండకూడదని సూచించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ భోజన వసతి వంటి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. విద్యుత్ వ్యవస్థపై అప్రమత్తంగా ఉండాలని, స్తంభాలు, వైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తుపాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. ఎక్కడా ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

## మఠం మఠాధిపతి నియామకం కొరకు వినతుల వెల్లువ

- వర్షం సైతం లెక్కచేయని స్వామివారి భక్తులు
- దక్షిణాది రాష్ట్రాల నుండి భారీగా తరలి వచ్చిన భక్తులు
- హాజరైన దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్
- కుటుంబ సభ్యుల మధ్య సయోధ్యకుదురుచుటకు ప్రయత్నించిన స్వామీజీలు
- స్వామీజీల చర్చలు విఫలం



**బ్రహ్మం గారి మఠం ( జర్నలిస్ట్ ఫైల్):**భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 11వ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వాముల వారు శివైక్యం పొందిన అనంతరం 12వ మఠాధిపతి నియామకం కొరకు కుటుంబ సభ్యులలో సఖ్యత లేక కోర్టును ఆశ్రయించగా గౌరవ హైకోర్టు ఉత్తర్వులు మేరకు ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ రీజనల్ అధికారి చంద్రశేఖర్ ఆజాద్ అధ్యక్షతన కమిటీని నిర్ణయించి 12వ మఠాధిపతి నియామకం కొరకు సాంప్రదాయ బద్ధంగా చట్టాల అనుసరించి అదే మఠం కు సంబంధించిన ఆచారాలు కట్టుబాట్లతో పరిధిలోకి తీసుకొని స్వామీజీలు శిష్యుల అభిప్రాయాలు హిందూ సాంప్రదాయకు చెందిన భక్తుల అభిప్రాయాలను తెలుసుకుని నివేదిక వెల్లబుచ్చమని చెప్పిన నేపథ్యంలో మంగళవారం నాడు బ్రహ్మంగారిమఠం మఠం పరిధిలో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా దక్షిణాది రాష్ట్రాల నుండి భారీగా స్వామి వారి భక్తులు తరలివచ్చి తమ అభిప్రాయాన్ని వెల్లడించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ అల్లాడుపల్లె దేవస్థానం ఈవో శంకర్ బాలాజీ,మఠం మేనేజర్ ఈశ్వరయ్య చారి దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

**భారీ వర్షాన్ని లెక్క చేయని భక్తులు**

ధార్మిక పరిషత్ దేవాదాయశాఖ సంయుక్త నిర్వహణలో బ్రహ్మంగారిమఠం 12వ మఠాధిపతి నియామకం కొరకు అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించగా తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మఠంలో భారీ వర్షం కురిసిన స్వామి వారి మీద ఉన్న భక్తి భావనతో మఠానికి అదే సాంప్రదాయానికి చెందిన అదే కుటుంబానికి చెందిన వ్యక్తులు మఠాధిపతిగా ఉండాలని అభిప్రాయంతో తమ అభిప్రాయాన్ని వెల్లబుచ్చాలని వర్షాన్ని కూడా లెక్కచేయకుండా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ అభిప్రాయాన్ని వెల్లబుచ్చారు

**రీజనల్ జాయింట్ కమిషనర్ మాటల్లో**

గౌరవ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ నిర్వహణలో బ్రహ్మంగారిమఠం మఠాధిపతి నియామకం కొరకు తనను నియమించడం జరిగిందని నేడు అదే సాంప్రదాయం చెందిన భక్తులు స్వామీజీలు శిష్యుల చేత అభిప్రాయ స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఇక్కడ దాదాపు 3 వేల మందికి పైగా భక్తులు తమ అభిప్రాయాన్ని వెళ్ళబుచ్చారని భక్తులు వెళ్లబుచ్చిన అభిప్రాయాలను తాము పరిగణలోకి తీసుకొని తొమ్మిది రోజుల లోపల ధార్మిక పరిషత్ కు నివేదికను పంపించడం జరుగుతుందని తదుపరి ధార్మిక పరిషత్తు బ్రహ్మంగారి మఠం 12వ మఠాధిపతి మీ నియమించే కార్యక్రమం తీసుకుంటుందని వారు తెలిపారు

**స్వామీజీల చర్చలు విఫలం**

బ్రహ్మంగారిమఠం 12వ మఠాధిపతి నియమం కొరకు పోటీలో ఉన్న మొదటి కుమారుడు వెంకటాద్రి స్వామి,రెండవ కుమారుడు వీరభద్ర స్వామి,గోవిందస్వామి మధ్య సయోధ్య కుదురుచుటకు హిందూ సంప్రదాయం చెందిన స్వామీజీలు చర్చలు జరపగా చర్చలకు కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో స్వామీజీల చర్చలు విఫలమైనట్లు చర్చించుకుంటున్నారు.

## ఆకస్మిక వరదలకు వచ్చేఅవకాశం..!అప్రమత్తంగా ఉండాలి

- 132 పునరావాస కేంద్రాల్లో 8 వేల మంది

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)**ఆకస్మిక వరదలకు అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి మొంథా తుఫానుపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని తద్వారా బాపట్ల జిల్లా చుట్టుప్రక్కల మండలాల్లో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. రాత్రి అందరు అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాగులు, వంకలు ఎవరు దాటకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని నీటి వనరుల పరిస్థితి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

వ్యవసాయం, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ తదితర శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు.

90 నుండి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, చెట్లు పడితే తక్షణం తొలగించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 132 పునరావాస కేంద్రాల్లో 8 వేల మందికి పునరావాసం కల్పించినట్లు జిల్లా కలెక్టర్ చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0863 2234014 కు సమాచారం తక్షణం చేరవేయాలని ఆదేశించారు.

## జ్యోతిబాపూలే పాఠశాలను సందర్శించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**సత్తెనపల్లి నియోజకవర్గం, ముప్పాళ్ల మండలం, మాదల గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ పాఠశాలను.. మంగళవారం. బీసీ వెల్ఫేర్ మంత్రి ఎస్. సవిత గారు, నరసరావుపేట ఎంపీ లావు కృష్ణ దేవరాయలు , సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సందర్శించారు. స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు కలుగుతున్న మౌలిక సౌకర్యాలు, భోజన సదుపాయాలను పరిశీలించారు.. విద్యార్థులను కలిసి భోజన సదుపాయంపై ఆరా తీసి వారితో కలిసి భోజనం చేశారు . నాణ్యమైన విద్యను అందించడంలో సౌకర్యాలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం రాజీ పడటం లేదని, ఎటువంటి ఇబ్బందులున్నప్పటికీ తమ దృష్టికి తీసుకురావాలనీ సూచించారు.అనంతరం రాజుపాలెం లో మంజూరైన బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్ నిర్మాణానికి భూ పరిశీలన చేశారు. అనంతరం రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల దగ్గర్లో ఉన్న బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి, శిథిలావస్థలో ఉన్న ఈ భవనం అభివృద్ధికి, కొత్త భవన నిర్మాణానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

## పునరావాస కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

- కాల్వల్లో నీటి ప్రవాహంపై అప్రమత్తంగా ఉండాలి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**మొంథా తుఫాను దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉంది. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మంగళవారం ఉదయం 7 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభించారు. ఇందులో నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసుల కూడా ఉన్నారు. తుఫాను నేపథ్యంలో సహాయ పునరావాస కార్యక్రమాలను, సన్నద్ధత ఏర్పాట్లను పరిశీలించారు. బుడంపాడులో పీకల వాగు అవుట్ ఫ్లో డ్రెయిన్ పరిశీలించారు. డ్రెయిన్ లో వరద నీరు సక్రమంగా ప్రవహించేలా అడ్డంకులు తొలగించాలని, నీటి ప్రవాహాన్ని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అవుట్ ఫ్లో డ్రెయిన్ లో ప్లాస్టిక్ , ఇతర వ్యర్థాలు అడ్డుకోవడానికి ఏర్పాటుచేసిన ఇనుప జల్లెడ వల్ల వరద నీరు ప్రవాహానికి ఇబ్బంది ఉందని వెంటనే దాన్ని తొలగించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. బుడంపాడు విష్ణు సదనములో, స్తంభాల గరువు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ పారిశుధ్యం, మంచినీరు భోజన సౌకర్యాలను తనిఖీ చేశారు. కేంద్రాల్లో ఉన్న పిల్లలకు పాలు అందించాలని, అల్పాహారం, భోజనం, సురక్షితమైన తాగునీరు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. మరుగుదొడ్లు, విద్యుత్తు దీపాలు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేసే విధంగా పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగానికి ప్రజల సహకరించి పునరావాస కేంద్రాలకు తరలి రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కేంద్రాల్లో మంచి ఆహార పానీయాలు, వసతి కల్పించడం జరిగిందని చెప్పారు. తాడికొండ మండలం అమరావతి రహదారిపై లాం వాగులో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. తుళ్లూరు లో రాజధాని ప్రాంత పనులు నిర్వహిస్తున్న ఆర్ వీ ఆర్ సంస్థ కార్మికుల తాత్కాలిక వసతి కేంద్రాలను పరిశీలించారు. తుఫాను గాలులు నేపథ్యంలో తాత్కాలిక షెడ్లుకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంటే కార్మికులను వెంటనే రక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు.

తుఫానుకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0863 2234014 ఏర్పాటు చేశామని దీంతోపాటు డివిజన్, మండల స్థాయిలోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని చెప్పారు. తుఫానుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు తెలియజేయవచ్చని, అలాగే సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ కు వస్తున్న ఫిర్యాదులపై తక్షణం స్పందించడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు తుఫాను దృష్ట్యా ఇంటి వద్దనే ఉండాలని పిలుపునిచ్చారు. సరిపడా నిత్యావసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. గాలి వేగం ఎక్కువగా ఉంటుందని, పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు చెట్ల కింద, నీటి వనరులు వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఉండవద్దని సూచించారు.

తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా తో కలిసి మంగళగిరి రెవిన్యూ డివిజన్ తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరం కమ్యూనిటీ హాల్లో, ఇప్పటం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో 190 పునరావాస కేంద్రాల గుర్తింపు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**భారీ వర్ష సూచన నేపథ్యంలో జిల్లాలో 190 పునరావాస కేంద్రాలు గుర్తించామని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా మంగళవారం వెల్లడించారు. నరసరావు పేట డివిజన్ లో 159, సత్తెనపల్లి డివిజన్ లో 22, గురజాల డివిజన్ లో 9 పునరావాస కేంద్రాలను గుర్తించామన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తక్షణ సహాయం కోసం జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 08647 252999 కి డయల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## తుఫాన్ ధాటికి చెట్టు కూలి రాకపోకలకు అంతరాయం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :**నరసరావుపేట మండలంలోని రావిపాడులో సెయింట్ మేరీస్ స్కూల్ సమీపంలో నరసరావు పేట నుండి నగరికల్లు వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన ఉన్న భారీ చింతచెట్టు తుఫాన్ గాలులకు మంగళవారం ప్రమాదవశాత్తు నేలకొరిగింది. ఎప్పుడూ రద్దీగా ఉండే బైపాస్ రోడ్ లో చెట్టు కుప్పకోలే సమయంలో వాహనాలు లేకపోవడంతో తప్పిన ప్రమాదం. ఈ నేపథ్యంలో రోడ్డుపై అడ్డంగా చెట్టు పడిపోవడంతో కొంత ట్రాఫిక్ అంతరాయం కలిగింది. సంబంధిత అధికారులు వెంటనే చెట్టును తొలగించాలని ప్రజలు కోరారు.

## మోంథా తుఫాన్ ప్రభావం - గుంటూరు ఎస్పీ క్షేత్రస్థాయిలో పర్యటన

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** మోంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్. పునరావాస కేంద్రాలను సందర్శించి ప్రజలకు అందుతున్న వసతులను ఆరాతీశారు. అవసరమైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.



ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, పొన్నూరు రూరల్ మరియు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాగులు, రహదారులు, వరద ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యలకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.

ప్రత్తిపాడు గ్రామంలోని బీవీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, పెదనందిపాడు గ్రామంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్, కాకుమాను మండలం గరికపాడు కమ్యూనిటీ హాల్, పొన్నూరు రూరల్ మండలం వల్లభరావు పాలెం ఎంపీపీ స్కూల్‌లలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పిల్లలకు, ప్రజలకు స్వయంగా భోజనం వడ్డించి, పండ్లు, బ్రెడ్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ మరియు ఇతర శాఖల సమన్వయంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ప్రమాదకర వాగులు, వంతెనలు, కాలువల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాగులు ఉప్పొంగే అవకాశం ఉన్న గ్రామాల్లో ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం లైఫ్ జాకెట్లు, రైన్‌కోట్లు, తాళ్లు, టార్చ్‌లైట్లు, కమ్యూనికేషన్ పరికరాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రధాన వాగులు, చెరువులు, వంతెనలు, నదీ పరివాహక ప్రాంతాల్లో గస్తీ బలపరచి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వరదలు, రహదారుల పరిస్థితిపై నిఘా కోసం డ్రోన్ సేవలు వినియోగించాలన్నారు. రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, నీటిపారుదల, విద్యుత్ శాఖలతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలినప్పుడు సంబంధిత శాఖల సహకారంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు.

రహదారులపై వాహన రాకపోకలు సజావుగా సాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల కోసం జేసీబీలు, ప్రొక్లెయిన్లు, లైట్లు, బ్యాకప్ పవర్ వనరులు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ మరియు రెవెన్యూ శాఖల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## యువతను మోసం చేస్తే మనుగడ శూన్యం- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** యువజనులను మోసం చేసిన ఏ ప్రభుత్వం కూడా మనుగడ కొనసాగించిన దాఖలాలు చరిత్రలో లేవని శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వ్యాఖ్యానించారు. అందుకు కూటమి ప్రభుత్వం మినహాయింపు కాదని ఆయన తేల్చి చెప్పారు. చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా కూడా యువతను మోసం చేస్తూనే వచ్చారని ఆయన విమర్శించారు. అయితే ఈసారి తమకు చేసిన మోసంపై యువతరం తిరగబడి కూటమి ప్రభుత్వాన్ని కూకటి వేళ్లతో పెకిలించి వేసే రోజులు దగ్గరపడ్డాయని లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగానికి సంబంధించి నూతనంగా నియమితులైన గుంటూరు నగర ఉపాధ్యక్షుడు యద్ల వెంకటేష్ రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి దూపాటి అనిల్, నగర కార్యదర్శులు చెరుకుల ప్రశాంత్ రెడ్డి, మద్దూరి రామకృష్ణారెడ్డి, పఠాన్ ఇమ్రాన్ ఖాన్



మంగళవారం బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి స్వయంగా శాలువాలు కప్పి ప్రత్యేకంగా అభినందించారు.

అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, "బాబొస్తే జాబొస్తుందన్నారు.. 20 లక్షల ఉద్యోగాలతో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామన్నారు.. చివరికి దేశంలోనే అత్యధిక నిరుద్యోగులు గల రాష్ట్రాల జాబితాలో మన రాష్ట్రాన్ని మూడో స్థానంలో నిలిపారు. ఉద్యోగం కల్పించలేని పక్షంలో నెలనెలా మూడు వేల రూపాయల భృతి చెల్లిస్తామని నమ్మబలికి నిరుద్యోగులను నట్టేట ముంచారు" అని మండిపడ్డారు.ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ హయాంలోనే యువతకు ప్రయోజనం చేకూరిందని లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. ఉద్యోగ – ఉపాధి అవకాశాలతో యువతకు చేయూతనందించిన ఘనత ఒక్క వైయస్ జగన్‌కు మాత్రమే సొంతమన్నారు. సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థల ద్వారా రాష్ట్రంలో కొత్తగా నాలుగు లక్షల మందికి ఉద్యోగం కల్పించిన వాస్తవాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అంతే కాక స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఫైబర్ నెట్, ఆప్‌కాస్ తదితర సంస్థల సాయంతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాలలో పేదరికపు చిమ్మ చీకట్లు పారద్రోలి ప్రగతి కాంతులు నింపారని ఆయన వివరించారు. అయితే చంద్రబాబు మాత్రం తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయడం, ఏపీ ఫైబర్ నెట్ మూసివేయడం, స్కిల్ డెవలప్‌మెంట్, ఆప్‌కాస్ తదితర సంస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా లక్షలాది మంది ఉద్యోగాలు ఊడబీకి వారి కుటుంబాలను బజారు పాల్జేశారని ఆరోపించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమకు జరిగిన అన్యాయంపై ఓవైపు ప్రభుత్వాన్ని నిగ్గదీసి అడుగుతూనే మరోవైపు తమకు మేలు చేసిన వైయస్ జగన్ నాయకత్వాన్ని మరింత బలపరచాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి యువతరానికి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, కార్పొరేటర్ దూపాటి వంశీ, నేతలు ఆలా కిరణ్, రెడ్డి కోటేశ్వరరావు, కాటూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## సీఎం చంద్రబాబును కలిసిన మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** :ముఖ్యమంత్రి నారా చంద్రబాబుని మంగళవారం ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన ఆమె పలు అంశాలపై వారితో చర్చించారు. మహిళా సాధికారత దిశగా కమిషన్ భవిష్యత్ ప్రణాళికను సీఎంకు వివరించారు. అదేవిధంగా మొంథాన్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్త చర్యల్లో భాగంగా గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించి.. వారికి వైద్యసాయం అందించడంలో ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధను మహిళా కమిషన్ తరఫున ఆమె సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. చైర్ పర్సన్ గా పదవిలోకి వచ్చిన అనతికాలంలోనే మహిళా కమిషన్ కు మంచి పేరు తెచ్చిన రాయపాటి శైలజను సీఎం చంద్రబాబు అభినందించారు.

## సిపియస్‌కు ఆప్షన్ ఇచ్చిన ఆర్టీసీ ఉద్యోగుల ఇపియస్ కాంట్రిబ్యూషన్ డబ్బులు చెల్లించాలి

○ **ఏపి పిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్**

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్)** : ఆర్టీసీలో ఇపియస్-95 స్కీమ్ నుంచి సిపియస్‌కు ఆప్షన్ ఇచ్చిన ఉద్యోగుల ఇపియస్ కాంట్రిబ్యూషన్ మొత్తాలను వడ్డీతో సహా చెల్లించాలని ఏపి పిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది.

2020 జనవరి 1వ తేదీ నుంచి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు ఏపి పిటిడి సిబ్బందిగా మారిన విషయం తెలిసిందే. విలీనం అనంతరం ప్రభుత్వం ఇచ్చిన ఆప్షన్ ప్రకారం ఇపియస్-95లో ఉన్న ఉద్యోగులు సిపియస్‌లోకి మారేందుకు అవకాశం కల్పించగా, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3 వేల మంది ఉద్యోగులు ఆప్షన్ వినియోగించుకున్నారు.

ఇపియస్ వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు రికవరీ చేసిన ఎంప్లాయీ, ఎంప్లాయర్ కాంట్రిబ్యూషన్ మొత్తాలను వడ్డీతో పాటు ఆర్టీసీ పీఎఫ్ ట్రస్ట్‌లో ఉన్న నిధుల నుండి సంబంధిత ఉద్యోగులకు తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ నేతలు విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు, ఫైనాన్స్ అడ్వైజర్ మరియు చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్‌కు మంగళవారం లేఖ అందజేశామని రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## పునరావాస కేంద్రాలను సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



○ **అధికారులు ప్రజలు అవసరమయిన భోజనాలు, మెడిసిన్, మంచినీరు, పాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించిన ఎమ్మెల్యే**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)** :మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి సందర్శించారు. తుఫాన్ నేపథ్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ప్రజల సౌకర్యాలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులను అవసరమైన సూచనలు చేశారు. తొలుత ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుంటూరు మిర్చి యార్డు, స్థంబాల గరువు పుల్లయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. అక్కడ తుఫాన్ కారణంగా నివాసాలు విడిచి వచ్చిన ప్రజలను పరామర్శించి, వారికి అందిస్తున్న ఆహారం, వైద్య సదుపాయాలు, శానిటేషన్ పరిస్థితులు, త్రాగునీటి వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో దాదాపు 23 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసాం. ప్రస్తుతం మిర్చి యార్డు, పుల్లయ్య స్కూల్, చిన్మయ స్కూల్ కేంద్రాలు పూర్తిగా నిండిపోయాయి. ఒక్క పుల్లయ్య హైస్కూల్‌లోనే దాదాపు 180 మంది ఉండగా, రాత్రి నుంచే అధికారులు వారికి ఆహారం, టిఫిన్, నీరు వంటి అవసరమైన సదుపాయాలను అందించారు. అన్ని కేంద్రాల్లో కూడా సరిపడా టాయిలెట్లు, శుభ్రమైన త్రాగు నీరు, శానిటేషన్ నిర్వహణ పై ఎమ్మెల్యే గళ్ళా మాధవి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రధానంగా 36వ డివిజన్ రైలుకట్ట ప్రాంత నివాసితులు పెద్ద సంఖ్యలో ఈ పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారని, ప్రజలందరికీ అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి సచివాలయ సిబ్బంది, పార్టీ కేడర్, అధికారులందరూ అందుబాటులో ఉన్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. అదే విధంగా నియోజకవర్గ ప్రజలకు ఏ అవసరం వచ్చినా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయంను, నోడల్ ఆఫీసర్లను లేదా స్థానిక కార్పొరేటర్లను సంప్రదించాలని, మేము వెంటనే స్పందిస్తాం" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు భరోసా ఇచ్చారు. తుఫాన్ తగ్గిన వెంటనే డిసిల్టేషన్ మరియు డ్రైనేజ్ క్లీనింగ్ పనులను ప్రారంభిస్తామని, సగంలో నిలిచిపోయిన డ్రైనేజ్, రోడ్డు పనులను పూర్తిచేయడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని, ప్రధాన కూడళ్ళ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని హామీనిచ్చారు.

ఇప్పటికే ఆర్‌ఓబీ పనుల కారణంగా ఏర్పడిన ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి పోలీస్ విభాగంతో సమీక్ష జరిపామని,ప్రజలు అవసరం అయితే తప్ప బయటికి రావొద్దని, వర్షాలు ఉన్నంతవరకు ప్రజలు నీటిని కాచుకుని వడపోసి తాగాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ స్వయంగా తుఫాన్ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వం, అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు ప్రజల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నారు," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. తుఫాన్ సమయంలో ప్రజలకు అండగా నిలిచి, పార్టీలకు అతీతంగా సేవలు అందించాలంటూ పార్టీ కార్యకర్తలకు ఆమె పిలుపునిచ్చారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు ధైర్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరి భద్రతే ప్రభుత్వం ప్రధాన ప్రాధాన్యం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి భరోసా ఇచ్చారు.

## 'మొంథా' తుఫాన్ ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధం కండి

○ **డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇన్చార్జి మంత్రి అచ్చెన్నాయుడు**

○ **విద్యుత్, టెలికాం, తాగునీటి సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు**

○ **డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారి,ఇతర శాఖల అధికారులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్ష**



**అమలాపురం,(జర్నలిస్ట్ ఫైల్)**: తుఫాన్లు వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సహజ సిద్ధంగా సంభవిస్తాయని వాటి వల్ల ప్రాణ, ఆస్తి నష్టా లకు తావు లేకుండా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించాలని కోనసీమ జిల్లా ఇన్చార్జ్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.

మంగళవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో మొంథా తుఫాన్ తీవ్రత,సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ, రోడ్లు రాక పోకలు, విద్యుత్ సరఫరా అంశాలపై ప్రత్యేక అధికారి విజయరామరాజు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధ్యక్షతన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఆస్తి, ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలను, సహాయక చర్యలను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సూచించారన్నారు. జిల్లాలో ఇప్పటికే తాడిచెట్టు పడి ఒక మహిళ మరణిం చడం దురదృష్టకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రకృతి విపత్తుల పట్ల వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో స్వయం గా పర్యవేక్షిస్తూ నష్టాలు తీవ్రతను తగ్గిం చడంలో ముఖ్య మంత్రి వర్యులు ఎంతో అనుభవం ఉందని, హుదూద్ వంటి పలు తుఫానుల ద్వారా గడించారన్నారు. అదే స్ఫూర్తితో తుఫాన్ తీవ్రత వల్ల జరిగే నష్టాలను పూర్తిగా నివా రించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు.

పూరి గుడిసెలు, పక్కా గృహాలు సముద్ర తీరానికి ఒక కిలోమీటర్ పరిధిలో నివాసముంటున్న వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. చాలామంది అవగాహన లేని కారణంగా ఇల్లు విడిచి బయటకు రావడానికి ఇష్టపడరని, అయి నప్పటికీ వారి యోగక్షేమాలను కోరుతూ బలవంతంగా నైనా తరలించాలన్నారు. మొంథా తుఫాను నేటి (మంగళవారం) సాయంత్రం 5 గంటలు రాత్రి 10 గంటల మధ్య రాజోలు సమీప ప్రాంతంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడిం చినట్లు మంత్రివ ర్యులు తెలిపారు. జిల్లా ప్రజానీకానికి టైం టు టైం వరద హెచ్చరికల సమాచారాన్ని అందిస్తూ... అప్రమత్తం చేయాలని అధి కారులను ఆదేశించారు. ఇప్పటికే ఈదురుగాలుల తీవ్రత క్రమంగా పెరుగు తోందని ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. అందరినీ పునరావాస కేంద్రాలకు తీసు కువచ్చి రేపు సాయంత్రం వరకు పునరావస కేంద్రాలలో ఆశ్రయం కల్పించి రాత్రి భోజనం అనంతరం తిరిగి ప్రభుత్వం ప్రకటించిన రూ 3 వేల ఆర్థిక సహాయాన్ని, మత్స్యకార నిర్వాసితులకు ఉచితంగా 25 కేజీల బియ్యాన్ని అందించి ఇంటికి బాధితులనుపంపించాలన్నారు. ప్రత్యేక అధికారులు జిల్లా కలెక్టర్ సూచనలతో జనరేటర్లు అవసరమైన చోట ఏర్పాటు చేసుకొని వాటికి అవసరమైన డీజిల్ ను కూడా సరఫరా చేస్తామని తెలిపారు.

ఎవరికి ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు చేపట్టాలన్నారు జిల్లాలో నిరాశ్రయులైన వారందరికీ ఆర్థిక సహాయం అందించాలన్నారు. తుఫాన్ అనంతరం రోడ్లపై పడిపోయిన చెట్లు తొలగిస్తూ రాకపోకలు, అదేవిధంగా నేలకోరిగిన విద్యుత్ స్తం భాలు నెలకొల్పి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్లమెంట్ సభ్యులు జి హరీష్ మాధుర్, స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు, ముమ్మిడివరం శాసనస భ్యులు దాట్ల సుబ్బరాజు, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్‌ఓ కే.మాధవి, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్, అగ్నిమాపక విపత్తుల స్పందన, పంచాయతీరాజ్ విభాగాల అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు

## బాధ్యత గల పౌరులుగా ఎదగండి

○ **జాతి నిర్మాణం, దేశాభివృద్ధికి కృషి చేయాలి**

○ **ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. మధుమూర్తి**

○ **ఘనంగా ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం**

○ **ప్రతిభ గల విద్యార్థులకు గోల్డు, సిల్వర్ మెడల్స్ ప్రధానం**



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** :ఉన్నత ఉద్యను పూర్తి చేసిన ప్రతి విద్యార్థి సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ముధుమూర్తి పిలుపునిచ్చారు. జాతి నిర్మాణం, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం పెరగాలని కోరారు. ప్రపంచస్థాయి సంస్థల్లో కీలక పాత్ర పోషించేందుకు అవసరమైన జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. మంగళవారం ఉదయం నీరుకొండలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 5వ స్నాతకోత్సవానికి డాక్టర్ మధు మూర్తి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

యూనివర్సిటీ కులపతి డాక్టర్ టి ఆర్ పారవేందర్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో మధు మూర్తి విద్యార్థులకు పలు సూచనలు చేశారు ఎస్ఆర్ఎం వంటి అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలో బీటెక్ చదువులు పూర్తి చేసిన విద్యార్థులకు టిసిఎస్, కాగ్నిజెంట్,గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు.

స్వర్ణాంధ్ర సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విజనరీ 'రోడ్ మ్యాప్ తో ముందుకు సాగుతుందన్నారు. ఎంతో శక్తివంతమైన గూగుల్ ఏఐ డేటా సెంటర్ విశాఖకు మంజూరు కావడము ఎంతో గొప్ప విషయం అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తరఫున స్నాతకోత్సవానికి తాను హాజరయ్యానని మంత్రి లోకేష్ విద్యార్థులకు తన అభినందనలను మెసేజ్ ద్వారా పంపారని వివరించారు.

యూనివర్సిటీ ఫౌండర్ ఛాన్సలర్ డాక్టర్ టి ఆర్ పారివేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి విజనరీ లీడర్ అన్నారు చంద్రబాబు నాయుడు కోరిక మేరకే ఏపీలో యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు విశ్వవ్యాప్తంగా ఎక్కడైనా మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ డిగ్రీలు అందుకున్న విద్యార్థులు వర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు శాంతి సహనంతో విజయ సోపానాలు అధిరోహించవచ్చని తెలియజేశారు ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్ వార్షిక నివేదికను సమర్పించారు

**విద్యార్థులకు డిగ్రీలతో పాటు బంగారు, వెండి పతకాలు...**

ఈ సందర్భంగా 2020-25 విద్యా సంవత్సరంలో బిటెక్, పిహెచ్డి, బిఏ, బీకాం చదువులు పూర్తి చేసుకున్న 1877 మంది విద్యార్థులకు డిగ్రీలు, ఇందులో ప్రతిభ గల విద్యార్థులకు బంగారు, వెండి పతకాలను ప్రధానం చేశారు అనంతరం విద్యార్థులతో కులపతి పారివేందర్ ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం ట్రస్ట్ సభ్యురాలు మణిమంగై, ఎస్ఆర్ఎం గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి నారాయణరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్ డీన్ లు డాక్టర్ విష్ణుపత్, వినాయక కల్లూరి, డాక్టర్ ఎన్వి రమణ రావు, డాక్టర్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు

## టెట్ అంశంపై సుప్రీంకోర్టు తీర్పుపై రిట్ పిటిషన్ వేయనున్న ప్రభుత్వం



○ **విద్యాశాఖ మంత్రి నారా లోకేష్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ )**: టెట్ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలోనే రిట్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. తెలుగుదేశం పార్టీకి చెందిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బి. రాంభూపాల్ రెడ్డి, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణతో కలిసి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. హైమారావు మంగళవారం విద్యాశాఖ మంత్రిని కలిసి వివిధ ఉపాధ్యాయ సమస్యలపై ప్రాతినిధ్యం చేశారు. 2011కు ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పుపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రిట్ పిటిషన్ వేయాలని కోరారు. అదేవిధంగా ఎంఈఓ-1, ఎంఈఓ-2 బదిలీలు చేపట్టాలని, మున్సిపల్ మరియు కార్పొరేషన్ పాఠశాల ఉపాధ్యాయులకు జీపీఎఫ్ అకౌంట్లు వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, డీఎస్సీ-2025 ద్వారా ఇటీవల ఏలూరు, విశాఖపట్నం, కడప జిల్లాల బాలనేరస్తుల పాఠశాలల్లో నియమితులైన ఉపాధ్యాయులకు 32,670 బేసిక్ స్కేలు బదులు 28,280 స్కేలు ఇవ్వడం సవరించాలని, డైట్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని వారు కోరారు. ఈ అంశాలపై మంత్రి లోతుగా చర్చించి, టెట్ అంశంపై సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేయాలని నిర్ణయించారు. అదనంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రధానోపాధ్యాయుల కోసం త్వరలో విద్యా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## టెట్ నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి - ఆర్.జే.యు.పి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** :దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు, రిటైర్మెంట్‌కు ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారిని మినహాయించి, మిగతా వారందరూ రెండు సంవత్సరాల లోపు టెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాల్సిందేనని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అన్యాయమని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.షరీఫ్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికే 25 నుంచి 30 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులపై ఈ వయస్సులో బలవంతంగా పరీక్ష రుద్దడం దారుణమని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని, మానసిక ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులకు సాంత్వన కలిగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం గురించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ ద్వారా వివరాలు తెలియజేశామని షరీఫ్ తెలిపారు.

## టెట్ విషయంపై రివ్యూ పిటిషన్ వేయాలని ప్రభుత్వ నిర్ణయానికి హర్షం

○ **తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం**

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** :టెట్ విషయంలో ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనను పరిగణనలోకి తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని నిర్ణయించినందుకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం హర్షం వ్యక్తం చేసింది.

తెలుగుదేశం పార్టీకి చెందిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, బి. రాంభూపాల్ రెడ్డి, వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, పేరాబత్తుల రాజశేఖరం తదితరులు మంగళవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి టెట్ అంశంపై ఉపాధ్యాయ వర్గంలో నెలకొన్న ఆందోళనను వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయుల సమస్యలను శ్రద్ధగా పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టులో తక్షణమే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఉపాధ్యాయుల భావాలను గౌరవించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఆంధ్రాలో కోస్తా వెంట కన్నీటితో జీవన సమరం


○ **కష్టాల కడలిలో కోస్తా ఆంధ్ర..!**

○ **50 ఏళ్లలో 60 తుఫాన్లు**

○ **ఏటా కోస్తాకు కష్టాలు**

○ **అందాల కోస్తా ఛిద్రం**

○ **తీరం వెంట జనజీవనం అస్తవ్యస్తం**





**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :రాష్ట్రం విస్తారమైన సముద్ర తీరం ఉంది. ఈ సముద్రతీరం వెంట కోస్తా తీరం ఉంది. అద్భుతమైన కట్టడాలు, నగరాలు ఉన్నాయి. ఎన్నో మత్స్యకార కుటుంబాలు ఈ తీరం వెంట నివసిస్తున్నారు. సముద్రంలో చేపల వేట సాగిస్తూ జీవనం గడుపుతున్నారు. అయితే ప్రతి ఏటా బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుఫానులు, అల్ప పీడనాల ధాటికి తీరం వెంట జనజీవనం అతలాకుతలమవుతోందితరచూ ఏర్పడుతున్న వాయుగుండాలు, తుఫాను దాటికి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతోపాటు సహజ సిద్ధంగా, ప్రకృతిలో అందాల కనువిందు చేసే కోనసీమ తన వైభవాన్ని కోల్పోతోంది. తరచూ ఉప్పెనలా. విరుచుకుపడుతున్న ప్రకృతి వైపరీత్యాల వల్ల కోస్తా ఆంధ్ర లో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు జనజీవనం చిగురుటాకులా వణికి పోతోంది. ఒకసారి ఉత్తరకొస్తా, మరోసారి దక్షిణ కోస్తా వర్షాలకు దెబ్బతింటోంది. గత 50 సంవత్సరాల నుండి పరిశీలిస్తే సుమారు 60 వరకు తుఫాన్లు కోస్తా తీరంపై విరుచుకుపడ్డాయి. రాష్ట్రంలో మిగతా ప్రాంతాలతో పోలిస్తే కోస్తా జిల్లాల్లో వర్షాలు ఎక్కువగా కురవటం, ఇబ్బందులు పడటం ఈ ప్రాంత ప్రజలకు అలవాటే కావచ్చు. కానీ వేట ఈ ఇబ్బందులు తప్పడం లేదు. దీనివల్ల పుల్లర వాస కేంద్రాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు.

సుదీర్ఘ సముద్రతీరం ఉన్న ఏపీలోని కోస్తా ప్రాంతం ఏటా తుపాన్ల ధాటికి నష్టపోతోంది. బంగాళాఖాతంలో ఉష్ణోగ్రతల ప్రభావంతో ఏటా తుఫాన్లు సంభవిస్తున్నాయి. ఈ తుఫాన్లు ఏపీలోని శ్రీకాకుళం నుంచి నెల్లూరు మధ్య తీరం దాటుతున్నాయి. ఆ సమయంలో వీచే గాలులు, కురిసే వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. బంగాళాఖాతంలో రెండు సీజన్లలో తుఫాన్లు ఏర్పడుతుంటాయి. కొన్ని మే నెలలో ఏర్పడితే, మరికొన్ని అక్టోబరు, నవంబరు నెలల్లో వస్తుంటాయి. ఈ రెండు సీజన్లలోనూ పంట నష్టం ఎక్కువగా ఉంటోంది. మే నెలలో వచ్చే తుపానుల వల్ల మామిడితోపాటు ఉద్యాన రైతులు నష్టపోతుండగా, అక్టోబరు, నవంబరు నెలల్లో వరి రైతులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు.

ఏటా ఏపీని ఏదో ఒక తుపాను తాకుతోంది. దీంతో ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. 1971 నుంచి ఇప్పటివరకు దాదాపు 60 తుఫానులో ఏపీలో తీరం దాటాయి. 1977లో వచ్చిన దివిసీమ ఉప్పెనలో వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉపద్రవం సృష్టించిన దివిసీమ ఉప్పెన ఇప్పటి తరానికి కూడా గుర్తుకు తెస్తున్నారు. ఇక పక్కనే ఉన్న ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో తీరం దాటే తుపానుల వల్ల కూడా ఏపీలోని కొన్ని ప్రాంతాలు నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతుండటం వల్ల తుఫాన్ల తీవ్రత నానాటికి పెరుగుతోంది. 2014లో వచ్చిన హుద్ హుద్ తుఫాన్ బంగాళాఖాతంలో వచ్చిన మిగిలిన అన్ని తుఫాన్ల కంటే పెద్దదిగా చెబుతున్నారు. ప్రభుత్వం వద్ద అందుబాటులో గణాంకాల ప్రకారం 1971లో శ్రీకాకుళం జిల్లా బారువ వద్ద ఒక తుఫాన్ తీరం దాటింది. అది ఉద్దానం ప్రాంతంలో బీభత్సం సృష్టించింది.

ఇక 1977లో దివిసీమ ఉప్పెన ఆ ప్రాంతంలో భారీ ఎత్తున ప్రాణ, ఆస్తినష్టాన్ని కలిగించింది. రాష్ట్ర చరిత్రలో దివిసీమ ఉప్పెనను ఇప్పటికీ కథలు కథలుగా చెబుతుంటారు.

అదేవిధంగా 1996లో చంద్రబాబు తొలిసారి సీఎం అయిన ఏడాదికి వచ్చిన తుఫాన్ కోనసీమను గడగడలాడించింది. ఇది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని బులుసుతిప్ప వద్ద తీరం దాటింది. ఆ సమయంలో కోనసీమ వరదలతో తీవ్ర నష్టం వాటిల్లింది. 2000 నుంచి తుఫాన్లకు పేర్లు పెట్టడం ప్రారంభమవగా, 2000 నుంచి 2005 వరకు ఏపీని ఐదు తుపాన్లు తాకాయని ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి.

ఇలా ఏపీ చరిత్రలో ఎన్నో తుఫాన్లు చూడగా, 2014లో విశాఖను అతలాకుతలం చేసిన అతిపెద్ద భీకర తుఫాన్ హుద్ హుద్. ఈ తుఫాన్ ఏర్పడిన సమయంలోనూ చంద్రబాబు సీఎంగా ఉన్నారు. ఆ తుఫాన్ ధాటికి ఏకంగా రూ. 21,908 కోట్ల నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో అత్యధిక నష్టం వాటిల్లిన తుఫాను హుదు హుద్ గానే ఇప్పటికీ చెబుతున్నారు. అయితే ఇప్పుడు ఏర్పడిన మొంథా తుఫాన్ కూడా హుద్ హుద్ స్థాయిలోనే ప్రభావం చూపుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తుఫాను కారణంగా వంద నుంచి 120కి.మీ. స్పీడుతో గాలులు వీచే అవకాశం ఉందంటున్నారు. దీనివల్ల కొబ్బరి, అరటి తోటలతోపాటు విద్యుత్ సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందని భయపడుతున్నారు. ఇప్పుడు వచ్చిన తుఫాన్ కాకినాడ మచిలీపట్నం మధ్య తీరం దాటి అవకాశం ఉంది.

దీంతో ఈ ప్రాంతం బిక్కు బిక్కు మంటోంది. గత రెండు రోజుల నుంచి విస్తృతంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదుర గాలి వీస్తోంది. పలుచోట్ల ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసి ఆశ్రయం కల్పించింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467